# ధర్మవరం రామకృష్ణమాచార్యులు

డా॥ పి. ఎస్. ఆర్. అప్పారావు, ఎం. ఏ., పి హెచ్. డి.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D P R I.
Acc. No.
11441

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11441

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణ

అకాడమీ ప్రచురణ నం. 16
నవంబర్, 1978
ప్రతులు — 1000

894.827
APP

© A. P. SANGEETA NATAKA AKADEMI

వెల : రూ. 2
గ్రంథాలయ ప్రతి : రూ. 4

V. R NARLA MEMORIAL LIBRARY
V. R NARLA
D P R L
Acc. No.

*Cover Design:*
**V. Srinivasa Sarma**

ప్రతులకు :
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ,
కళాభవన్, హైదరాబాద్-500004.

Book Printed at Natyakala Press, Khairatabad;
Cover Page Printed at Avon Printing Works, Hyderabad.

-A0ヤA102B127

# ధర్మవరం రామకృష్ణమాచార్యులు

డాక్టర్ పోణంగి శ్రీరామ అప్పారావు జననం 1923. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎమ్. ఏ. పట్టం (1946), ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పి హెచ్. డి. పట్టం (తెలుగు నాటక వికాసము–1961) పొందినారు. పది సంవత్సరాలు తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసి, కార్య నిర్వాహక శాఖలోకి బదిలీ అయినారు. పాఠ్యగ్రంథ జాతీయీకరణ ప్రత్యేకోద్యోగిగా, సాంస్కృతిక వ్యవహారాల ప్రత్యేకోద్యోగిగా, ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమి గౌరవ కార్యదర్శిగా పనిచేసినారు. ప్రస్తుతం తెలుగు అకాడమి డైరక్టర్. వీరు రచించిన 'నాట్యశాస్త్రము' (1959) అనే గ్రంథానికి 1961 లో కేంద్ర సాహిత్య అకాడమి వారి 'నేషనల్ అవార్డు' లభించింది.

# తొలిపలుకు

సంగీత, నృత్య నాటకోత్సవాలను నిర్వహించటం, ఆ యా కళలలో శిక్షణాలయాలకు, సాంస్కృతిక సంస్థలకు, నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధ కళాకారులకు ఆర్థిక సహాయము చేయటం, మరుగున పడిపోతున్న మన సంప్రదాయ, జానపద కళారూపాల పునర్వికాసానికి కృషిచేయటం మున్నగు కార్యక్రమాలతో పాటు ఆ యా రంగాలలో పరిశోధన చేయించి, గ్రంథాలు ప్రచురించే కార్యక్రమాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ చేపట్టింది. ఈ పథకం క్రింద సంస్కృతంలోని ప్రామాణిక సంగీత, నృత్యశాస్త్ర గ్రంథాలను అనువదింపజేసి ప్రచురిస్తున్నాము. ఇంతవరకు 'సంగీత రత్నాకరం' మొదటిభాగం, 'నృత్తరత్నావళి', కర్నాటక సంగీతానికి సర్వస్వంగా పేరుపొందిన "సంగీత సంప్రదాయ ప్రదర్శిని" మొదటి సంపుటము ప్రచురించాము.

పూర్వగ్రంథాల అనువాదాలు, పునర్ముద్రణలు చేపట్టటమే కాక తెలుగునాట సంగీత, నృత్య, నాటక కళా వికాసాలను తెలియపరచే స్వతంత్ర గ్రంథాలను ప్రచురించాలని కూడా అకాడమీ సంకల్పించింది. మొదట నాటక కర్తలను గురించి గ్రంథాలను ప్రచురించాలని

అకాడమీ నిర్ణయించింది. ఆప్రకారం నాటక కర్తలుగా చిలకమర్తి, తిరుపతి వేంకట కవులు గురించిన గ్రంథాలను ప్రథమంగా ప్రచురించాము. ఇప్పుడు ధర్మవరం, కోలాచలం గురించిన గ్రంథాలను వెలువరిస్తున్నాము. గురజాడ, కందుకూరి, వేదం ప్రభృతి నాటక కర్తలను గురించి క్రమంగా గ్రంథాలను ప్రచురించ సంకల్పించాము. అదే విధంగా సంగీత, నృత్య కళాకోవిదుల గురించికూడా గ్రంథాలు ప్రచురించ తలపెట్టాము. అకాడమీ వెలువరిస్తున్న ప్రచురణలు కళాకారులకు, కళాభిమానులకు కూడా ఉపయోగకరం కాగలవని మా విశ్వాసము.

మేము కోరినంతనే ప్రసిద్ధ నాటకకర్తలు ధర్మవరంవారి జీవిత చరిత్ర వ్రాసి ఇచ్చిన డాక్టర్ పి. ఎస్. ఆర్. అప్పారావుగారికి ధన్యవాదములు తెలియపరుస్తున్నాము.

కె. ఆర్. పరమహంస
స్పెషల్ ఆఫీసర్
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ

# విజ్ఞప్తి

తెలుగు నాటకాలను గూర్చి పరిశోధన చేస్తున్న కాలంలో, అంటే 1957 డిసెంబరు నెలలో నేను బళ్ళారి వెళ్ళినప్పుడు ఆంధ్ర నాటక పితామహుని మూడవ కుమారులు శ్రీమాన్ రంగాచార్యులు గారి వల్ల, వారి మిత్రులు శ్రీ కప్పగల్లు సంజీవమూర్తి రావుగారి వల్ల అనేక విషయాలు తెలుసుకొన్నాను. అజామిళ, ఉషాపరిణయము, యుధిష్ఠిరయౌవరాజ్యపట్టాభిషేకము, సుగ్రీవపట్టాభిషేకము, హరిశ్చంద్ర అనే ఆచార్యుల వారి అముద్రితనాటకాలను రంగాచార్యులుగారు, వామనచరిత్రానువాదాన్ని సంజీవమూర్తి రావుగారు చదువుకొనటానికి ఇచ్చినారు. మూడు రోజులపాటు నాకు ఆదరంతో ఆతిథ్యమిచ్చినవారు రంగాచార్యులవారు. అచ్చటి పెద్దల పరిచయం కలిగించినవారు సంజీవమూర్తి రావుగారు. రంగాచార్యులు గారికి, వారి కుటుంబానికి, సంజీవమూర్తి రావుగారికి కృతజ్ఞుణ్ణి. ఆ మూడురోజులలో ఆంధ్రనాటక పితామహుడు సంచరించిన ప్రదేశాలను, వారికి సన్నిహితులైన వ్యక్తులను సందర్శించే భాగ్యం లభించింది.

ఆచార్యులవారి నాటకాలను గూర్చి ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు "ఆంధ్ర నాటక పితామహుడు" అనేపేర M. A. (Hons) పట్టం కొరకు సిద్ధాంత వ్యాసం రచించినారు; ఇది ఇటీవల ముద్రితమైనది. ధర్మవరం వారిని గూర్చి, కోలాచలం వారిని గూర్చి, శ్రీ శాశ్మపల్లి అనంతకృష్ణశర్మ గారొసంగిన ఉపన్యాసాలు "నాటకోపన్యాసములు" అనేపేర ముద్రితము లైనవి. 'పరిశోధన' 3వ సంచిక "ఆంధ్రనాటక పితామహ సంస్మరణ సంచిక"గా వెలువడినది. ఈ ప్రచురణలలో ఆంధ్రనాటక పితామహుని నాటకాలను గూర్చిన విమర్శ ఉన్నది. అందుచేత నేను నాటకాలవిమర్శకు ప్రత్యేకంగా పూనుకోలేదు — ఒక్క సారంగధర చరిత్ర విషయంలో తప్ప. ఆంధ్రనాటకపితామహుని అపూర్వ కృషికి దోహదం చేసిన ఆనాటి పరిస్థితులను, ఆచార్యులవారి నాటక రంగ జీవితాన్ని వివరించటమే నాధ్యేయం. ఇది ఈ రచనలో ఫలిస్తే నా కృషి సార్థకమైనట్లే, ఇందులకు సహృదయులే ప్రమాణము.

ప్రమాదీచ, పోణంగి శ్రీరామ అప్పారావు
కార్తీక పౌర్ణమి.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | పూర్వరంగం | 1 |
| 2. | జీవితసంగ్రహం | 5 |
| 3. | సమకాలీననాటకరంగం | 9 |
| 4. | సరసవినోదినీసభ | 15 |
| 5. | సంచారప్రదర్శనాలు | 24 |
| 6. | రామకృష్ణవిలాస్ | 33 |
| 7. | అభినవసరసవినోదినీసభ | 41 |
| 8. | ముద్రితనాటకాలు | 50 |
| 9. | అముద్రితనాటకాలు | 57 |
| 10. | విషాదసారంగధరము | 65 |
| 11. | రచనలో సామాన్య లక్షణాలు | 76 |
| | అనుబంధము - 1 | 85 |
| | అనుబంధము - 2 | 87 |

# పూర్వరంగం

తెలుగు దేశంలో ఆధునిక నాటకరంగవికాసంలో అనేక దశలున్నవి. అందులో మూడవ దశకు చెందినవారు శ్రీ ధర్మవరం రామ కృష్ణమాచార్యులు. ఈ మూడవ దశలో నాటకరంగానికి వీరు చేసిన సేవను గూర్చి వివరించేముందు, మొదటి రెండు దశలలో జరిగిన కృషిని గూర్చి దిఙ్మాత్రంగా అయినా వివరించటం సమంజసం; అవసరం కూడా.

తెలుగు దేశంలో ఆధునిక నాటక రచనా-ప్రదర్శనాలకు దారి తీసినవారు కళాశాలలలో, ఉన్నత పాఠశాలలలో పని చేసినవారు; ముఖ్యంగా తెలుగు పండితులు అనాడు ఆ నాటక సమాజాలకు వారే అధ్యక్షులు; దేశికులు కూడా వారే ఆ రచయితలకు అటు పాశ్చాత్య నాటకాలు, ఇటు సంస్కృత నాటకాలు మార్గదర్శకా లైనవి. ఇంక నటులకు ఇతర రాష్ట్రాల నుంచి సంచారం వచ్చిన నాటక సమాజాల ప్రదర్శనాలు మార్గదర్శకాలైనవి. ఈ విధంగా తెలుగుదేశంలో ఆధునిక నాటక రచన క్రీ. శ. 1860 ప్రాంతాల, ఆ నాటక ప్రదర్శన క్రీ. శ. 1880 ప్రాంతాల ఆరంభమైనవి.

తొలి దశలోని తొలినాటక కర్తలు ముగ్గురూ - శ్రీయుతులు కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వేంకటరత్నం పంతులు,

పరవస్తు వేంకట రంగాచార్యులు— కేవలం సంస్కృతాంధ్ర పండితులు. ఈ ముగ్గురిలో శాస్త్రిగారు ప్రప్రథమంగా స్వతంత్ర రూపక నిర్మాణానికి పూనుకొన్నారు. వీరి స్వతంత్ర రచన అయిన 'మంజరీ మధుకరీయము' ఆధునికకాలంలో తెలుగులో రచింపబడిన తొలి రూపకము. సంస్కృతంలోని ప్రకరణం పద్ధతిలో సాగిన ఈ రూపకం 1860 ప్రాంతాల రచింపబడినదని తెలుస్తున్నది (ముద్రణ మాత్రము చాలా ఆలస్యంగా 1908 లో జరిగింది.) తరవాత పంతులుగారు 1871 లో 'నరకాసుర విజయము' అనే సంస్కృత వ్యాయోగాన్ని ఆంధ్రీకరించినారు. ఇది 1872 లో ప్రకటితమైనది. సంస్కృత శ్లోకాన్ని తెలుగు పద్యంగాను, వచనాన్ని వచనంగాను ఆంధ్రీకరించటం వంటి నియమాలను ఆనాడు పంతులుగారు ఏర్పరచుకొన్నారు. ఈ నియమాలు నేటికీ అమలులో ఉన్నాయని చెప్పవచ్చు. ఇంక ఆచార్యుల వారు 1872 ప్రాంతాల కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని ఆంధ్రీకరించి, తొలి రెండంకాలు తమ పత్రికలో ప్రకటించినారు. మూలంలోని ప్రాకృతభావలస్థానంలో ఆచార్యులు గారు అచ్చ తెనుగు ప్రవేశపెట్టినారు.

1875 లో కోరాడవారి శిష్యులు, శ్రీవావిలాల వాసుదేవ శాస్త్రి అనే పట్టభద్రులు షేక్స్పియర్ నాటకమయిన జూలియస్ సీజర్‌ను 'సీజరు చరిత్రము' అనేపేర ఆంధ్రీకరించి ప్రకటించినారు. ఆంగ్ల రూపకాంధ్రీకరణానికి పూనుకొన్న ప్రథములు వావిలాల వారే. అంతేకాదు స్వతంత్ర సాంఘిక రూపకరచనకు పూనుకొన్న ప్రథములుకూడా వీరే. ఆనాటి సంఘంలోని అంతఃకలహాలను నిరూపిస్తున్న వీరి 'నందక రాజ్యము' 1880లో ప్రకటితమైనది. వావిలాల వారు ఈ రెండు రూపకాలను సంపూర్ణంగా తేటగీతిలో రచించినారు. అందుచేత వీరు తెలుగులో తొలి పద్య నాటకకర్తలుకూడాను.

ఈ నలువురి రచనలు ప్రదర్శింప బడినట్లు కన్పట్టదు. కాగా, వీరు తొలిదశకు, అంటే ఆధునిక నాటక రచనారంభదశకు చెందిన వారు అవుతున్నారు.

ఇంక రెండవ దశకు—అంటే ఆధునిక నాటక ప్రదర్శనారంభ దశకు—చెందిన వారిలో కందుకూరి వీరేశలింగం పంతులు గారు ప్రథములు. 1880-81 ప్రాంతాల ధార్వాడ నాటక సమాజ మొకటి తెలుగుదేశంలో సంచారంచేసి, ఆధునికపద్ధతులలో అనేక నాటకాలను ప్రదర్శించింది. ఆ ప్రదర్శనల ప్రభావానికి లోనైన పంతులుగారు 1880 వ సంవత్సరాంతంలో రాజమహేంద్రవరంలో విద్యార్థి నాటక సమాజాన్ని స్థాపించి, వారిచేత స్వీయరచనలను ప్రదర్శింపజేసినారు. ఈ ధార్వాడ నాటకసమాజప్రదర్శనాలవల్ల తెలుగుదేశంలో ఒకకొత్త చైతన్యము కలిగింది. 1886 లోపల గుంటూరు, బందరు, కాకినాడ మొదలైన ముఖ్యపట్టణాలలో నాటక సమాజాలు వెలసినవి. ఈదశలో నాటకకర్తలే ఇంచుమించుగా సమాజ స్థాపకులు, అధ్యక్షులు, దేశికులు.

వీరేశలింగం పంతులుగారి తొలి స్వతంత్ర రచన "బ్రాహ్మ వివాహము", సంస్కృతాంగ్ల నాటకాలకనువాదాలైన రత్నావళీ-చమత్కార రత్నావళులు 1880 చివర ప్రదర్శితాలైనవి. చమత్కార రత్నావళి షేక్స్పియర్ నాటకమైన "కామెడీ ఆఫ్ ఎర్రర్స్" కు అనుసరణము; పంతులుగారు దీనికి ఆంధ్రతాముద్రవేసి, స్వతంత్ర రచన అనే భ్రాంతి కలిగేటట్లు చేసినారు. తరవాత గుంటూరులో కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 1881-85 ప్రాంతాల గయోపాఖ్యానము, హరిశ్చంద్ర, యుగంధర విజయము, ద్రౌపదీ వస్త్రాపహరణము మొదలైన ముప్పది వచన నాటకాలు రచించి, ప్రదర్శింప జేసినారు (కాని, ఈ వ్రాతప్రతులన్నీ నశించిపోయినవి.) కొందు

భొట్లవారు స్థాపించిన "గుంటూరు హిందూ నాటక సమాజము" సభ్యులు రాజమహేంద్రవరం మొదలైన పట్టణాలలో కూడా ప్రదర్శనాలిచ్చి, ప్రశంసలు పొందినారు. రాజమహేంద్రవరంలో వడ్డాది సుబ్బారాయుడుగారు 1883 ప్రాంతాల "హిందూ నాటకోజ్జీవక సమాజము" స్థాపించి వేణీసంహారాదులను ఆంధ్రీకరించి, స్వయంగా పాత్రధారణచేసి, ప్రదర్శించినారు. కందుకూరి వారి అభిజ్ఞాన శాకుంతలానువాదము (1883), వడ్డాది వారి వేణీసంహారానువాదము తెలుగు నాటకరంగాన్ని చిరకాలం పాలించినవనిచెప్పవచ్చు. బందరులో నాదెళ్ళ పురుషోత్తమ కవిగారు "బందరు నేషనల్ థియాట్రికల్ సొసైటీ" వారి కొరకు ముప్పది రెండు హిందూస్తానీనాటకాలను, సత్యహరిశ్చంద్ర, రామదాసు చరిత్ర మొదలైన తెలుగు నాటకాలను రచించి, ప్రదర్శింపజేసినారు. కవిగారు హిందూస్తానీలోను, తెలుగులోను కూడా పాత్రానుకూల భాషా ప్రయోగంచేసి పాత్రోచిత భాషావాదానికి మూలపురుషులైనారు. అంతేకాదు 1880-81 ప్రాంతాల తెలుగు దేశంలో విజయ యాత్ర సాగించిన ధార్వాడ నాటక సమాజం వారు 1884–85 లో మరల తెలుగు దేశం వచ్చినప్పుడు కవిగారు తమ హిందూస్తానీ నాటకాలను ప్రదర్శించి, వారి ప్రశంసలు పొందినారు.

ఇటువంటి పూర్వరంగంతో 1886 ప్రాంతాల నుంచి తెలుగు నాటకరంగంలో మూడవదశ ప్రారంభమైనది. ఈ దశలో ప్రథమ గణ్యులు శ్రీ ధర్మవరం రామకృష్ణమాచార్యులవారు.

# జీవిత సంగ్రహం

తే. గీ. కలఁడుగాదె కౌశికగోత్ర కలిత కృష్ణ
మార్యపౌత్రుండు కృష్ణార్యునగ్రసుతుఁడు
ఆంధ్ర గీర్వాణ కర్ణాట కాఁగిలేయ
గీర్విశారదుఁడగు రామకృష్ణ సుకవి.

—చిత్రనళీయ నాటక ప్రస్తావనలో

ఆంధ్ర నాటక పితామహ బిరుదాంకితులైన ధర్మవరం రామకృష్ణమాచార్యుల వారు క్రీ. శ. 1853 లో (పరీధావి నామ సంవత్సర కార్తీక శుద్ధ ఏకదశినాడు) అనంతపురం జిల్లా, తాడిపత్రి తాలూకా, ధర్మవరం గ్రామంలో మాతామహుల ఇంటిలో జన్మించినారు. ఆచార్యులవారి పూర్వుల నివాసం కూడా ధర్మవరమే. వీరి మాతృమూర్తి శ్రీమతి లక్ష్మీదేవమ్మ; పితృపాదులు శ్రీమాన్ కోమాండూరు కృష్ణమాచార్యులు. ఆచార్యులవారి తండ్రి తాతల పేర్లుకూడా కృష్ణమాచార్యులే. ఆ వంశంలో పెద్దకొడుకునకు కృష్ణమాచార్యులు అని పేరుపెట్టడం ఆచారమట. అందుచేతనే ఆచార్యుల వారి పెద్ద కొడుకు పేరు కూడా కృష్ణమాచార్యులే.

భావి ఆంధ్రనాటక పితామహుడు జన్మించే నాటికే తండ్రి గారయిన కృష్ణమాచార్యులుగారు ధర్మవరం వదలిపెట్టి, బళ్ళారిలో స్థిరపడినారు. బళ్ళారిలోని వార్డ్లా కాలేజిలో వారు ఆంధ్రోపాధ్యాయులు. కాని, వైద్యులుగా వారెక్కువ ప్రసిద్ధి పొందినారు. అందుచేతనే వారిని వైద్యం కృష్ణమాచార్యులు అనేవారట. ధర్మవరం గ్రామానికి చెందిన వారు కావటంవల్ల 'ధర్మవరంకృష్ణమాచార్యులు' అనేవారు. ఇంటి పేరు 'కొమాండూరు'. మొత్తం మీద వీరిపేరు 'వైద్యంధర్మవరం కొమాండూరు కృష్ణమాచార్యులు' అయినది. తరవాతి కాలంలో ఆంధ్ర నాటక పితామహుడు మాత్రము 'ధర్మవరం' అనే గ్రామనామాన్ని మాత్రమే ఇంటిపేరుగా స్వీకరించినాడు; అందుచేతనే వీరికి 'ధర్మవరం [1] రామకృష్ణమాచార్యులు' అనేది వ్యవహార నామమైనది.

ఆచార్యులవారి తాతముత్తాతలు కూడా సంస్కృతాంధ్రాలలో పండితులే. ఆ సంస్కారం వీరిలో వెల్లివిరిసింది. ఆచార్యుల వారు ౬ మాసాలు వచ్చేటప్పటికే నడక మొదలు పెట్టినారట. ౩ వ సంవత్సరంలో అమరకోశము మూడుకాండలు కంఠస్థమైనవట. ౬ వ ఏట ప్రతాపరుద్రీయాదులు పఠించినారట. ఆచార్యుల వారికి తండ్రిగారే గురువు. నిరుపమానమైన సూక్ష్మగ్రహణశక్తి, అపూర్వమైన జ్ఞాపకశక్తి కలవారు కావటంచేత ఆచార్యులవారు అచిరకాలంలోనే బహుగ్రంథపఠనం కావించి, చక్కని పాండిత్యాన్ని, కవితాశక్తిని

1. ఇట్లా కొందరికి పాత గ్రామ నామం స్థిరపడితే మరికొందరికి కొత్త గ్రామనామం స్థిరపడటం గుర్తించవచ్చు. "కళాప్రపూర్ణ" రాఘవాచార్యుల వారి ఇంటిపేరు "తాడిపత్రి"; వారి జన్మస్థలంకూడా తాడిపత్రి గ్రామమే. కాని వారు బళ్ళారిలో స్థిరపడటంచేత "బళ్ళారి రాఘవాచార్యులు" అనే పేరే ప్రసిద్ధిలోకి వచ్చినది.

అలవరుచుకొన్నారు. అంతేకాదు అష్టావధానం అవలీలగా చేసే శక్తి కూడా సంపాదించి శ్రీకొక్కొండ వేంకటరత్నం పంతులు వంటి పెద్దల ప్రశంసలకు పాత్రులైనారట.

ఆచార్యులవారికి వైద్యం కూడా కొంతపట్టు పడింది. జ్యోతిషంలో కూడా మంచి అనుభవం సంపాదించినారు. ఆచార్యులవారి తొలికళత్రం వివాహమైన కొలది రోజులకే చనిపోయినదట. ఇంక రెండవ వివాహప్రయత్నంలో ఆచార్యుల వారొక వధువు జాతకం చూడటం సంభవించింది. ఆ జాతకం తనకు చాలా అనుకూలంగా ఉండటంచేత, ఆమెను వివాహం చేసుకొంటే తాను అత్యున్నత స్థితికి రాగల అవకాశాలుండటంచేత, తన బంధువుల కెవ్వరికీ ఇష్టం లేక పోయినా పట్టుపట్టి ఆమెనే వివాహమాడినారట. నిజంగా ఆమె కాపరానికి వచ్చిన తరవాతనే ఆచార్యుల వారికి సిరిసంపదలు గౌరవం ఇతోధికంగా లభించినవి. వీరికి చదరంగంలో కూడా మంచి ప్రవేశం ఉండేది మిత్రులతో కలిసి ఒకే ఆటను రోజుల తరబడి ఆడేవారట.

ఆచార్యులవారు సంస్కృతాంధ్రాలతోపాటు ఆంగ్లాన్ని కూడా అభ్యసించినారు. మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులై బళ్ళారి పుర పాలకోన్నత పాఠశాలలో కొంతకాలం ఉపాధ్యాయులుగా పనిచేసి, తరవాత ఆదవానిలోని తాలూకా కచేరీలో విలేకరిగా కొన్నాళ్ళుపని చేసినారు. ఆచార్యుల వారికి 16 సంవత్సరాలు వచ్చేటప్పటికి తండ్రి గారు పరమపదించినారు. అసలు వీరిది పేదకుటుంబము. పైగాముగ్గురు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెళ్ళు ఉన్నారు. ఆదవానిలో జీవనం జరగక మరలబళ్ళారికే వచ్చి, "కంటోన్ మెంటు మేజిస్ట్రేటు కోర్టు" లో ప్రైవేటు వకీలుగా పనిచేయ నారంభించిరి. భార్య కాపరానికి వచ్చినది. అప్పటి నుంచీ అదృష్టదేవత వారిపట్ల అనుగ్రహము చూపినది దారిద్ర్యము వెనుకపట్టినది. ప్రైవేటు వకీలు వృత్తిలో లభించిన

ఉత్తేజనంతో ఫస్టుగ్రేడుప్లీడరు పరీక్షకు చదవవలెనని ఉత్సాహపడి నారు. వెంటనే చదువు మొదలుపెట్టి, 1874 లో ఎఫ్. ఏ., ప్లీడరీ పరీక్షలు రెండింటిలో అవలీలగా ఉత్తీర్ణులైనారు. ఆచార్యుల వారు ఫస్టుగ్రేడు ప్లీడరు కావటంతో న్యాయవాదవృత్తి నిరాఘాటంగా సాగింది. ఆవృత్తిలో వారు అసమానులన్న పేరుసంపాదించుకొన్నారు. వారి వాద నైపుణ్యాన్ని గూర్చి కథలు చెప్పుకొంటారు ఆప్రాంతం వారు.

తండ్రిగారు మరణించినప్పటినుంచీ తమ్ముళ్ళను, చెల్లెళ్ళను పెంచి పెద్ద చేసే భారం ఆచార్యులవారి మీదనే పడింది; వారు ఆ భారాన్ని సంతోషపూర్వకంగా స్వీకరించినారు. పెద్ద తమ్ముడు శ్రీగోపాలాచార్యులు సెకండు గ్రేడు ప్లీడరు కావటమేకాక సుప్రసిద్ధ నాటకకర్త అయినారు. రెండవ తమ్ముడు శ్రీ శేషాచార్యులు, మూడవ తమ్ముడు వేంకటకృష్ణమాచార్యులుకూడా న్యాయవాదులే అయినారు. పెద్ద చెల్లెలు శ్రీమతి శేషమ్మగారు కళాప్రపూర్ణ టి. రాఘవాచార్యులవారి మాతృమూర్తి. రెండవ చెల్లెలు శ్రీమతి చిన్న శేషమ్మ; మూడవ చెల్లెలు శ్రీమతి కృష్ణమ్మ

# సమకాలీన నాటకరంగం

ఆనాడు కన్నడ యక్షగాననాటకసమాజాలవారు ఇతరరాష్ట్రాలలో సంచారంచేస్తూ ప్రదర్శనాలు ఇస్తూ ఉండేవారు. అటువంటి నాటక సమాజమొకటి ప్రదర్శించిన యక్షగానాన్ని చూసిన సాంగ్లీ మహారాజు క్రీ. శ. 1843 లో 'విష్ణుదాసభావే' అనే రచయితను ప్రోత్సహించి, మరాటీ భాషలో నాటకాలు వ్రాయించి, ప్రదర్శింప జేసినాడు. ఆధునిక మరాటీ నాటకాలకదే ప్రారంభము. అట్లే బళ్ళారి నాటక రచయితలకు కూడా కన్నడ యక్షగాన నాటక ప్రదర్శనాలే ప్రోత్సాహకాలైనవి. ఆ యక్షగాన సంగీతము బళ్ళారి పౌరులను బాగా ఆకర్షించినది.

గోపాలాచార్యులుగారు హోస్పేట దగ్గర ఉన్న నారాయణ దేవరకెరెలో న్యాయవాదిగా ఉండేవారు. అక్కడ రంగాచారి నాటక కంపెనీ వారు ప్రదర్శించిన నాటకాలను చూసి గోపాలాచార్యులుగారు ప్రభావితులైనారు. ఆ ఉత్సాహంతో తెలుగులో ఒక నాటకాన్ని వ్రాసి ఆ ఊరులోనే ప్రదర్శింపజేసినారు. కాని ఎందుచేతనో ఆ ప్రదర్శనం జయప్రదం కాలేదట. అది తనకు తీరని అపజయంగా భావించి, తెలుగులో నాటకం ఎందుకు వ్రాసితినా అని గోపాలాచార్యులుగారు బాధపడినారట. తమ్ముని బాధ కృష్ణమా

చార్యుల వారికి ఉద్రేకాన్ని, అభిమానాన్ని, ప్రోత్సాహాన్ని, పట్టుదలను కలిగించినవట. అప్పుడు ఆచార్యులవారే స్వయంగా నాటక రచనకు, నాటకప్రదర్శనకు పూనుకొని, ప్రప్రథమంగా 'స్వప్నానిరుద్ధము' అనే నాటికను కన్నడ భాషలో రచించి, ప్రదర్శించినారు. ఆ రచన, ఆ ప్రదర్శన కూడా చాలా రక్తికట్టినవట. అంతటితో ఆచార్యుల వారి ఉత్సాహము మిన్నుముట్టినది.

కాని, గోపాలాచార్యుల వారి తెలుగు నాటకం అపజయం పొందటంచేత, ఆచార్యులవారి కన్నడ నాటకం చక్కగా రక్తి కట్టడంచేత తెలుగు భాష నాటక రచనకు పనికిరాదనే భావం ప్రజలలో ప్రబలసాగింది. ఇది ఆచార్యుల వారికి సంతాపకారకమైనది. అప్పుడు వారు 'చిత్ర నళీయము' అనే నాటకాన్ని రచించి, విజయవంతంగా ప్రదర్శించి, ఆ అపవాదును పోగొట్టినారు. ఈ అపవాదును గూర్చి ఆచార్యుల వారు చిత్రనళీయ ప్రస్తావనలో ఇరువురు పౌరుల సంవాదరూపంలో చర్చించటమే కాక చిత్రనళీయ ప్రథమ ముద్రణ పీఠికలో ఆ యా విషయాలను విపులంగా వివరించినారు. ఈనాటి చిత్రనళీయం ముద్రణలో ఈ పీఠిక అదృశ్యంకావటం చేత, సహృదయులకు ఆ భావాలను ఆచార్యులవారి మాటలలోనే తెలుపవలెనన్న కోరికతోను ఆ పీఠికలోని భాగాలను ఇచ్చట పొందుపరుస్తున్నాను.

"దేశ భాషలందుఁ దెనుఁగు లెస్స యని సముచితముగ నుడువఁబడిన ఈ భాషపై నాకుఁజిన్ననాటి నుండి యున్న యభిలాష వశంబున, నిరువది యేఁడుల యీడు గలిగిన క్రీస్తుశకము 1874 సంవత్సరమున నేదేని కావ్యము రచియించు కుతూహలము కలిమి, గోత్రకర్తయగు గాధినందను చరిత్రము పద్యకావ్యము సగము వ్రాసి యప్పుడు నాకుఁ గలిగిన నాటకరచనా కుతూహలమున నంతకు నిలిపి

ముఖ్యముగా సంస్కృతమునందును, ఆంగిలేయ భాషయందును గల నాటకములనాసక్తిమై, ఇదివి 1879 సంవత్సరమున "ఉన్మాదరామప్రేక్షణికము" "మదనవిలాసము" అను పేరులు గల చిన్న నాటకముల రచియించి యీ చిత్రనళీయ నాటకము వచనభాగము కొంత రచియించితి. కాని, కార్యాంతరప్రసక్తుఁడనౌటచే నంతతో దానినుజ్జగించితి. మానవశక్తికి మించిన కొన్ని సందర్భముల వలన మరల 1886 సంవత్సరమువరకు నీ విషయము విచారింప సాధ్యము కాకయుండె.

"చిరకాలమునుండి మనవారిలో నాటకములన్న హేయములుగను, నాటకులన్న దూష్యులుగను భావించు వాడుక కలదు. ఈ భావము సమంచితము కాదనియు జనసముదాయమునకు నీతిని బోధించుటకు నాటకములకంటె సాధనములు వేఱొండు కలుగనేరవనియు, నీచకులజులొండె నీతిబాహ్యులొండె నాటకములు ప్రదర్శించుచువారు కొన్ని యకృత్యముల నొనర్చుట వలనను, సునీతిని బ్రదర్శించుటయే ముఖ్యోద్దేశముగాఁ గలిగిన నాటకములు మనలో లేకుండుట వలనను నాటకములకు మనలో దూషణగలుగుటకుఁ గారణమాయెననియు నా యెన్నిక. ఈ యెన్నికననుసరించి సమయ మొదవినప్పుడంతయు నా మిత్రులతో సంభాషించుచు నందందుపన్యసింపుచుంటిని. 1879 సంవత్సరమున నాకు సవయస్కులగు మిత్రులతోఁ గొన్నియాంగ్లేయ నాటకములు ప్రదర్శించు తలంపుగలుగ వారియందఱ తోడుపాటున రెండునూఱులట్లు ప్రదర్శించుట సంభవించె. ఆ యింగ్లీషు నాటకములకుఁ దోడుగ పైనఁ జెప్పిన చిట్టి తెలుగు నాటకములు సయితమీఁ బడియె. నీతిని మాత్రము బోధించునుద్దేశమున నొక నాఁట, రెండునాళ్ళ, ప్రారంభింపఁబడి ముగియింపఁబడిన యీ గ్రంథములే చూడవచ్చినవారు మిక్కిలి యాదరించునట్లు ఘటిల్లె. మొదటినుండి పాటుపడి సంవిధానములు కుదుర్చుకొని నాటకములు రచియింపఁబడెనేని జనసమూహమింకను నెక్కువగా నాదరింతురుగదా

యని యుత్సాహము జనించుటయు, నన్నెల్లప్పుడెడబాయని మిత్రుఁడును నాటకపరిచయము పెంపున నదివఱకే కర్ణాటక భాషయందు నాటకముల రచియింపఁ బ్రారంభించిన వాఁడుననగు బ్రహ్మశ్రీ చిత్తవాడిగి హనుమంతగౌడు నన్నెంతయు నందునకుఁ బ్రోత్సాహపఱచుటయుఁ గాఁగా నాంధ్రమున నళనాటకమునకు సూచిక నేర్పఱచుకొని కొంత వచనభాగము గూర్చితిని. ఆ యుద్యమమప్పుడంతతో నుజ్జగింపవలసి వచ్చెనని యిదివఱకే చెప్పఁబడెఁగదా?

"తరువాత 1886 వ సంవత్సరమున నా మిత్రమండలి నన్నెంతయు నాటకరచనమునకును, తన్నాటకఖేలనమునకును నుత్సహింపజేసె. వారందఱు బహుతరముగా నాంధ్రభాష నభిలాషచే నభ్యసించిన వారయ్యుఁ గర్నాటక భాషయందించుక పక్షపాతము కలవారుఁగాఁ బొడకట్టె. అదియుంగాక వారదివఱకు నందందుఁజూచిన నాటకములు కర్నాటక నాటకములే కావున దేశభాషలలో నాటకములకుఁ దగిన భాష కన్నడమే యనియు, తెనుఁగందునకుఁదగదనియు నొక్క పట్టు వారికి స్థిరముగాఁ గలిగె. దృష్టాంతయుక్తముగ నేనెంత ప్రబోధించినను వారి పట్టుమానదయ్యె. నాకా కన్నడమునందును నొక్కింత పరిచయమున్నందున వారి మతము చొప్పునఁ బోవలసివచ్చి మొట్టమొదట స్వప్నానిరుద్ధమను పేర నుషాకల్యాణచరిత్రమును గన్నడ భాష నాటకముగా నొనరించితి. మామకమిత్రకోటి "సరస వినోదిని" యనుపేర నొక సభగానేర్పడియె. ఆ సభవారి వలన నా నాటకము 1886 వ సంవత్సరము సెప్టెంబరునెల 14 వ తేదీనాఁడు ఖేలనముగావింపఁబడియె. నెలలోపల మూఁడు మారులానాటకమాడఁబడినను ఆ మూఁడు మాఱులును దిదృక్షాగతులకుఁ గొందరికి నెడమఱ్ఱుటయే కఱవయ్యె. ఈ సరసవినోదిని సభయొక్క చరిత్రమంతయు వ్రాయవలయునన్న నెన్నియో గ్రంథమ లగును. తొలుతఁ గొన్నినాళ్ళు వివే

కమును విమర్శక శక్తియుఁ జాలని జనులవలన దూషింపఁబడిన తెలుంగును, తనివితీఱ దూషించిన భంగియంతయుఁ దరువాత నుపేక్షయందుఁ బరిణమించిన చందమును, ఆ యుపేక్ష పోయి పిదప నపేక్షకుఁ దిరిగిన కరణియు, ఆగ్రహానిగ్రహములన్నియు ననుగ్రహమునకు మాఱినకైవడియు, ఆ సభఁ జేరిన వారెట్టివారగుటయు, వారే మొనర్చియుండుటయు ఇవియన్నియు నుగ్గడించి వ్రాయుట కిది చోటునుగాదు, సమయమునుగాదు.

"ఈ స్వప్నానిరుద్ధ నాటకమాడిన పిదపఁ దెనుఁగున నొక నాటకమైన రచియించి యాడుటకై నా మిత్రుల యనుజ్ఞ వేడితి. తెనుఁగున నాటకము భంగపాటునకుం బరిహాసమునకుం గారణమగు నని మనసారా నమ్మియుండియు నా యుత్సాహభంగ మొనర్చుట కిష్టపడక విధిలేక యందునకు సమ్మతించిరి. అప్పుడీ చిత్రనళీయ నాటకము సొంతముగా రచియింపఁబడి ఖేలనము గావింపఁబడియె. ఊరివారును వినోదమునకేని చూడవచ్చిరి కాని తమకీ నాటకము వలన ముదము గలుగఁగలదని యెంచి వచ్చినవారు కారట. అయినను, దెలుఁగుభాషయొక్క బళ్ళారియందు గలిగియుండిన దుర్ప్రాప్తికడచను వేళ యెదిగివచ్చినందునఁ గాబోలు, కన్నడ నాటకమునకంటె నీ నాటకము విశేషాదృతమయ్యె. నాఁటినుండి తెనుఁగన్న మఱికొండఱు చూడవచ్చునట్లు సంఘటిల్లి, బళ్ళారి కన్నడసీమ కాదనుమాట స్థిరముగా నాటుకొనునట్లు ధ్వనిల్లె. ఈ మాటవలనఁ గన్నడ భాష తెనుఁగునకంటెఁ దక్కువయని చెప్పనుద్యమించిన వాఁడఁగాను. నాకుఁ దెలుఁగు నందుఁబోలెఁ గన్నడమున విశేషపరిచయము చాలమియే యీ సభవారి తెనుఁగు నాటకములకు బ్రాశస్త్యము గలిగించెనని చెప్పినను జెప్పవచ్చును. అయిన, మంచిచదువరులై యుభయభాషల నెఱిఁగియున్న మా మిత్రులకు నాటకములకుఁ దెలుఁగు తగిన భాషకాదను మతము పట్టువడియుండెనే యనుట కింతచెప్పవలసి

వచ్చెను. ఈ చిత్రనళీయ నాటకమునయున్న ప్రస్తావన, ఈ సందర్భములు తెలియనివారికి నర్థరహితముగాఁ దోఁపఁగలదని యీ విషయము వ్రాయువలసి వచ్చె".

ఈ పీఠికనుబట్టి క్రింది విషయాలు స్పష్టమవుతున్నాయి- ఆచార్యులవారు క్రీ.శ. 1874 లో కావ్య రచన అరంభించినారు. 1879 లో నాటకరచన అరంభమైనది. 1886 లో 'సరసవినోదినీసభ' నెలకొన్నది. 14-9-1886 తేదీన వారి కన్నడ నాటకము 'స్వప్నానిరుద్ధము' ప్రథమ ప్రదర్శనము పొందింది; సరసవినోదిని సభవారి ప్రథమ ప్రదర్శనము కూడ అదే. వెంటనే చిత్రనళీయ రచన పూర్తి చేసినారు; అది 29-1-1887 తేదీన ప్రప్రథమంగా ప్రదర్శింపబడింది. చిత్రనళీయ ప్రదర్శనము జయప్రదం కావటంతో తెలుగుభాష నాటకభాషగా పనికిరాదన్న అపవాదు పోవటమే కాక, చివరికి 'బళ్ళారి తెలుగు సీమ' అన్నమాట స్థిరపడింది.

# సరస వినోదినీ సభ

రెండు సంవత్సరాలుగా దేశాన్ని అల్లకల్లోలంచేసిన కఱవు 1873 తో అంతమైనది. కఱవు సమయంలో ఆచార్యులవారు, సి. హెచ్. గాడ్ మొదలైన మిత్రులు కలిసి ఒక 'వీరసంఘము'గా ఏర్పడి ప్రజలకు సేవచేసినారు. తరువాత, ఆ సంఘము, 'డిబేటింగ్ సొసైటీ' గామారింది. ఈ సొసైటీవారు 1879 లో రెండు ఆంగ్ల నాటకాలు, రెండు కన్నడ నాటకాలు ప్రదర్శించినట్లు తెలుసుకొన్నాము. 1884లో మైసూరునుంచి ఒక నాటక కంపెనీవచ్చి, నృత్యనాటకాలు ప్రదర్శించింది. అందలి నటులు బహుళ సన్మానాలు పొందినారు. వారి సంగీతము బళ్ళారి పౌరులను ఎక్కువగా ఆకర్షించింది. అప్పటినుంచీ ఆచార్యులవారు ఒకనాటకసభను స్థాపించవలెనని కృషిచేస్తూనే వచ్చినారు. 1885 సంవత్సరం చివరిభాగంలో వారి కృషి ఫలప్రదమై, 1886 లో 'సరసవినోదినీసభ' స్థాపితమైనది. ఆనాడు నాటకాలాడే వారంటే సంఘంలో గౌరవంలేదు. అయినా, సాహసంతో ప్రప్రథమంగా 30 మంది సభ్యులు చేరినారు. ఆచార్యులవారే అధ్యక్షులుగా ఎన్నుకోబడినారు. సభ్యులంతా గౌరవకుటుంబీకులే – కొందరు న్యాయవాదులు, మరికొందరు ఆయా కార్యాలయాలలో ఉద్యో

గులు; తక్కినవారు వర్తకులు, భూస్వాములు.[2] ఈ ముప్పదిమంది సభ్యులు కాక మరి ముప్పది మంది అభిమానులు కూడా ఉండే వారట.

సరసవినోదినీసభను గూర్చి ఆచార్యులవారు చమత్కరిస్తూ ఉండే వారట. 'సరసవినోదని' లోని మొదటి మూడు అక్షరాలను క్రమక్రమంగా విడిచివేసినా భావార్థం మారదని — సరసవినోదిని, రసవినోదిని, సవినోదిని, వినోదిని.

సరసవినోదినీ సభ ఆశయాలు ఆంగ్లంలో కింది విధంగా నిర్వ చింప బడినవి—

1. To raise the moral standard of the stage which had fallen very low in public estimation;
2. To afford recreation to the people and thus make them forget awhile the toils and worries of life;
3. To inculcate homely morals in the most agreeable form;
4. To raise the drama in which the vernacular literature has been lamentably poor.

పై ఆశయాలను నెరవేర్చుకొనటంలోనే కాక ధర్మ కార్యాలు చేయటంలోను, పేదవిద్యార్థులకు చదువు చెప్పించటంలోను సరస

---

2 సి. హెచ్. గాడ్ గారితో సహా ఈ సరసవినోదినీ సభా సభ్యులంతా అగ్రవర్ణులే-"ఈ నాటకముల ప్రదర్శించువారు సార్థక విద్యావంతులును, మనీషా విశేషులును నగు సగ్రజన్ములు, సరసవినోదిని సభకుం జేరిన వారు" అని చిత్రనళీయ ప్రస్తావనమందు ఆచార్యులవారే పేర్కొన్నారు.

వినోదినీసభ ముందంజవేసి పేరుపొందటం ప్రశంసనీయమైన విష యము. ఆదిలో బళ్ళారి ప్రజలు ఈసభయెడ విముఖులై, అనేక విఘ్నాలు కలిగించటానికి ప్రయత్నించినప్పటికీ, పట్టుదలతో సభ్యు లంతా పనిచేసి, బాలారిష్టాలను గడచి బళ్ళారి ప్రజలనేకాక రాష్ట్రి ప్రజలనందరినీ తమకు సుముఖులుగా చేసుకోగల్గినారు.

సరసవినోదినీసభవారు 1886 లో ఆచార్యులవారి స్వప్నాని రుద్ధమును ప్రదర్శించినారు; 1887 ప్రారంభంలో ఆచార్యులవారి చిత్రనళీయమును ప్రదర్శించినారు. 1888 లో మూడు కొత్త నాట కాలు – హరిశ్చంద్ర, మనుచరిత్ర, సుభద్రాపరిణయములు[3] – ప్రద ర్శింపబడినవి. 1889 ప్రారంభంలో గోపాలాచార్యులవారి కన్నడ ఉత్తరరామచరిత ప్రదర్శితమైనది. తరవాత ఒకవారంలో ఆచా ర్యులవారి 'విషాద సారంగధరము' ప్రదర్శింపబడినది. ఈ ప్రదర్శనాలతో సరసవినోదినీసభవారి కీర్తి మిన్నుముట్టినది. ఈ విషాదసారంగధరము ఆచార్యులవారి ఆరవనాటకము. తరవాత ఆచార్యులవారు ఇంచు మించుగా 20 తెలుగు నాటకాలు రచించినారు; వాటినెల్ల సరసవినో దినీసభవారే ప్రదర్శించినారు.

ఈ సందర్భంలో సరసవినోదినీసభవారి ప్రదర్శనాలను గురించి, నటులను గురించి తెలుసుకోవటం సమంజసము. చిత్రనళీయము ప్రప్రథ

---

3. ఇవి ఎవరి రచనలో తెలియలేదు. ఆచార్యులవారు హరిశ్చంద్రను 1910 లో రచించినారు. బహుశః ఇది గోపాలాచార్యులవారి రచన అగునేమో? ఆచార్యులవారు వరూధిని అనే పేరుతో మనుచరిత్ర కథను నాటకీకరించిరి. ఈ రచన ఎప్పటిదో తెలియదు. "సుభద్రార్జు నీయము" అనేపేరుతో గోపాలాచార్యుల వారొక నాటకము వ్రాసి నారు; కాని అది 1915 నాటి రచన.

మంగా ప్రదర్శింపబడినప్పుడు ఎవరెవరు భూమికాధారణము చేసినారో ప్రథమ ముద్రణమందు తెలుపబడినది (చూ. అనుబంధము-1). నాయకుడగు నలుని భూమికను ఆచార్యులవారే ధరించినారు. నాయిక అయిన దమయంతి భూమికను భూస్వామి, పెద్దవర్తకులు అయిన కొరివి శేష శాస్త్రిగారు ధరించిరి. మునిసిపల్ యూనియన్ ఛైర్మన్, గౌరవ మేజిస్ట్రేటు అయిన హనుమంతగౌడ్ గారు కలిపురుషుని భూమిక ధరించిరి. తక్కిన భూమికలను ప్రసిద్ధ న్యాయవాదులు, ఉపాధ్యాయులు, గుమాస్తాలు ధరించిరి.

సరసవినోదినీసభ వారి ప్రదర్శనాలన్నింటను రిహార్సలు చేయించేభారాన్ని ఆచార్యులవారే వహించినారు. ఏదేనా నాటకాన్ని వ్రాయ తలపెట్టినప్పుడు అందులోని భూమికలకు తగిన నటులను ముందుగానే నిర్ణయించుకొనేవారు. తరవాత ఆ నటులను దృష్టిలో పెట్టుకొని తమ రచనలను కొంతవరకు మలచేవారు. రిహార్సల్ సమయంలో ఆచార్యులవారు చాలా క్రమశిక్షణ పాటించేవారట. ఏమాత్రం అలసతను కానీ, అజాగ్రత్తను కానీ సహించేవారు కారట. ఏదేనా లోపం వస్తే తీవ్రంగా మందలించేవారు; చేయిచేసుకొన్న సందర్భాలుకూడా లేకపోలేదని అంటారు. ఒకసారి పాదుకలో మంథర వేషం వేసిన నాగేశశాస్త్రి అనే యువకుడు రంగస్థలంమీద వాచికం మరచిపోయి సొంతకవిత్వము మొదలుపెట్టినాడట. ఆ రంగము ముగియగానే ఆచార్యులవారు నేపథ్యగృహంలో వాని చెంపలు వాయించినారట; అటు తరువాత మళ్ళా అటువంటి పొరపాట్లు జరగలేదని అంటారు. ఆచార్యులవారి తమ్ముడు వేంకట కృష్ణమాచార్యులుగారు నిండైన విగ్రహము; కమ్మగా పాడగలిగిన వారే కాని అభినయంలో కొంత తీసికట్టు. "సంగీతంలోపడి అభినయం

చెడగొట్టుతున్నా" వని ఒకసారి ఆచార్యులవారు మందలించగా కోపంతో రిహార్సల్‌కు రావటం మానివేసినారట. అప్పుడు ఆచార్యుల వారు ఒక క్రొత్తనటుని చేరదీసి, సంగీతం అభినయం బాగా నేర్పి, అద్భుతంగా నటింపజేసినారట. అంతటితో తమ్ముడు సిగ్గుపడి, మళ్ళీ అన్నగారితో కలిసినారట.

తాము అనుకొన్నట్లుగా నటులు నటించగలరనే నమ్మకం కుదిరినప్పుడే ఆచార్యులవారు ప్రదర్శనకు పూనుకొనేవారు. లేకపోతే ఎంతకాలమైనా ఓపికతో శిక్షణ ఇచ్చేవారు. ఒకసారి పాదుకలో మంథరవేషం వేసిన వానిని తయారుచేయటానికి మూడు నెలలు పట్టిన దట. ముక్తావళి నాటకంలో నాయికాభూమిక ధరించినవానికి ఒక దీర్ఘవచనం నేర్పటానికి రెండునెలలు పట్టినదట. ఒక్కొక్కసారి నటులమధ్య పోటీపెట్టి, తగినవానిని ఎన్నుకొనటం జరిగేదట. తొలి సంవత్సరాలలో ఆచార్యులవారు అభినయానికే ప్రాముఖ్యమిచ్చే వారు. తరవాత తరవాత దృశ్యానికి కూడా ప్రాముఖ్యమీయనారం భించినారు. ఇంకొక ముఖ్యవిషయం—ఆచార్యులవారు ఆంగికాభినయం మీదకంటే వాచికాభినయం మీదనే ఎక్కువశ్రద్ధ చూపేవారు. రిహార్సల్సులో ఎక్కువకాలం ఉచ్చారణ సౌష్ఠవానికే వెచ్చించే వారట. ఆచార్యులవారికంటె పెద్దవారూ, పెద్దబావగారూ అయిన తాడిపత్రి నరసింహాచార్యులుగారు (రాఘవాచార్యులవారి పితృ పాదులు) సరసవినోదినీసభకు 'ప్రాంప్టర్'. వీరు బళ్ళారిలో సీనియర్ తెలుగుపండితులుగా పనిచేస్తూ సభాకార్యకలాపాలలో ఆచార్యుల వారికి చేదోడువాదోడుగా ఉండేవారట.

సరసవినోదినీసభ మొదటితరం నటులలో ఆచార్యులవారే నాయక భూమికలను ధరించేవారు. కొరివి శేషశాస్త్రిగారు నాయికా భూమికలను ధరించేవారు. ఆచార్యులవారి సోదరులగు గోపాలా

చార్యులుగారు కూడా స్త్రీ భూమికలను ధరించేవారట. పడసాల శ్రీరాములుగారు ఉపనాయక భూమికలను ధరించేవారు; వీరు తరవాత సబ్ మేజిస్ట్రేటుగా పించను పుచ్చుకొన్నారు. రాయచూరు భీమారావుగారు రత్నాంగి మొదలైన భూమికలను ధరించేవారు. హార్మోనియం మనదేశానికి రావడానికి పూర్వం రెండు తంబురాలు, రెండు ఫిడేళ్ళు ఉపయోగించేవారట. హార్మోనియం వచ్చిన తరవాత రంగనాథ మొదలియార్ అనే ధనవంతుడు స్నేహధర్మంలో సరసవినోదినీ సభకు మొదటి హార్మోనిస్టు అయినారు. రతవాత మదరాసు సుగుణవిలాససభలో పనిచేయటానికి రంగనాథ మొదలియార్ వెళ్ళిపోయినారు. మొదట్లో బోగంగొల్లప్ప, తరవాత ఆముదాల వేంకటస్వామి ఫిడేలు వాయించేవారు. తిప్పన తబలా వాయించేవాడు. రాయచూరు భీమారావుగారికి కూడా తబలా వాయించటంలో ప్రవేశం బాగానే ఉండేదట.

తరవాతికాలంలో ఆచార్యులవారు దశరథుడు, రాజనరేంద్రుడు మొదలగు భూమికలు ధరించగా తమ్ముడు వేంకటకృష్ణమాచార్యులుగారు రాముడు, సారంగధరుడు మొదలైన పాత్రలు ధరించేవారు. హాళగంజి రామచంద్రరావు[4] అనే విద్యార్థి నాయికా భూమికలను ధరించేవాడు. కూనూరి నరసింగరావు, హుబ్బళి

4. ఇతనిని "హాళగంజిరాములు" అనే వారట. ఇతడు సుందరరూపి. రంగస్థలంమీద అచ్చంగా ఆడుపుట్టువుగానే గోచరించే వాడని చెబుతారు. చిత్రాంగి, కైకవంటి భూమికలను నిర్వహించటంలో అటువంటి వాడింకొకడు ఉండడని బళ్ళారి పెద్దల నమ్మకము. ఆచార్యుల వారి తర్ఫీదు అటువంటిది. అతడు ఆచార్యులవారితో దేశమంతా తిరిగి వచ్చెను. అతనికి వచ్చిన పతకాలతో ఒక అంగడి పెట్టుకోవచ్చునట! కాని, చివరకు చాలా పేదరికంతో, 60 సంవత్సరాలుదాటిన వయస్సులో స్వస్థలమైన 'మంత్రాలయము'లో చనిపోయెనట.

మాధవరావు, నాగేశ్వరశాస్త్రి, బాదనహట్టి శ్రీనివాసరావు, బాదనహట్టి మాధవరావు (హాస్యనటులు), దొడ్డిగోవిందరావు, రావు బహదూర్ హనుమంతగౌడ్, కర్నూలు విశ్వనాథరావు, జోష్‌గిరి ఆచారి మొదలైనవారుకూడా ఈ సభలో భూమికలను ధరించిన వారే.

ఆచార్యులవారు సంగీతంలో నిధులట. పాటలకు పద్యాలకు రాగాలు వారే నిర్ణయించేవారు. సంగీతంపై ఎంత అభిమానమున్నా రంగస్థలాన్ని పాటకచేరీగా మార్చటానికి వారెన్నడూ అంగీకరించ లేదు. అర్థాన్ని, అభినయాన్ని చెడగొట్టని శ్రావ్యమైన సంగీతాన్నే వారు పాడేవారు; రంగస్థలంమీద అంగీకరించేవారు. "గాయకునకు తంబుర ఎంతగా ఉపయోగపడుతుందో, నటునకు సంగీతం అంత మాత్రమే ఉపయోగపడవలె"నని వారి ఆశయము. మోహన, జంఝూటి, కేదారగౌళ, కమాజురాగాలు వారికి అత్యంతము ప్రీతి పాత్రములట. పాటలనుగూర్చిన తమ అభిప్రాయాన్ని ఆచార్యుల వారు చిత్రనళీయం ప్రథమ ముద్రణ పీఠికలో ఇట్లా తెలిపినారు—

"ఈ నాటకమును, మఱియితరములగు నాటకములును, ఆడఁబడిన కాలమునఁ బాటలుకొన్ని రచియింపఁబడియుండె. ఈ పాటల విషయమై యొక్కింత వక్కాణింపఁదగియున్నది. నాటకములు సామాన్యముగాఁ బద్యగద్యాత్మకములై కానంబడియెడి పాటలు గలది యక్షగానమను పేరునఁ బరఁగుచున్నది. ఈ నాటకములు సర్వ విషయముల నింగ్లీషు భాషయందును, సంస్కృత భాషయందునుగల నాటకలక్షణముల ననుసరించియే రచియింపఁబడినవికాని యక్షగాన ములవలె రచియింపఁబడినవికావు. అయిన నీనాటకములు తత్కాల మునఁగ్రీడించి చూడవచ్చినవారికి సుబోధగలిగించు తలంపు కలిమి వలనను, జనసామాన్యమునకుఁ బద్యములయందు విశేషాభిలాషము కలుగకుండుటంజేసియు, అట్టి వారు గానమును బాటలను నాద

రించుటఁ జేసియు, వారి యాదరణము ముఖ్యముగాఁ గలుగవల యుటం జేసియు నాటకముల యందందుఁ బద్యములుండినను బహు తరముగఁ బాటలు నెలకొల్పఁబడియె. ఈ నాటక ప్రస్తావనయందే యీ విషయమును సూచింపఁబడియె. ఈ పాటలతో నాటకముల నెల్లె ప్రచురింపింపవలయునని మొదటనుండి నా యుద్దేశముకాదు. ధీరపద్ధతిగల నాటకమునఁ బాటలుండుట యంతసురుచిరము కాదనియే నా తాత్పర్యము. మాతృభాషయందు నిండుసాహితికలవారి "నాట కాంతసాహితి" కలవారని యాఖ్యగలిగింపఁజాలు నాటకములున్న యట్లు, ఆంధ్రభాషయందట్టివి లేవుగాయను లోపమును వాయా వచ్ఛక్తి సవరించుతలంపే పట్టుపడియుండుటచే సాహితిని వృద్ధిచేయఁ జాలు శక్తిచాలని పాటలనందుఁబొందింపవలయునని నాయుద్దేశము గాదు. కాఁబట్టి పాటలున్నచోట్ల నెల్లఁ దగినభంగిఁ బద్యములఁ బొందు పఱచియున్నాఁడ. పాటలయందును నభిలాషముగల వారి కోరికఁదీఱుప నా పాటలనొక ప్రక్కనఁ బ్రచురించినాఁడ. ఈ మాటల వలనఁ బాటలు గర్హణీయములని చెప్పనెంచినవాఁడఁగాను. వ్యాకరణ దుష్టములగు పదములమాని ప్రాసాదినియమములఁ దప్పక రచి యింపఁబడిన పాటలు తఱుచుగా నుండమిచే సాహితీ నైపుణి గల వారికి వానియందు పేటు పొడమియుండుఁగాక పాటలేమి పాప మొనర్చినవి? వానియందు రసమొదవదా? పాకము లభింపదా? భావము గలుగదా? ఛందోనియమము చాలదా? అయిన నాటక కుర్దన మొనరించువారికి రాగమునందును దాళమునందును ధ్యానము మానకుండవలయుటం జేసి పద్యములయందుఁబోలెఁ బాటలయందు భావప్రకటనము గలిగింప నిర్బంధము గలుగు ననుటమాత్ర మొప్ప కొనఁదగియున్నది. ఈ కారణము చేతనే మానవలసివచ్చెఁగాని

వేఱొండు కారణమువలనఁగాదు. అరసిచూడఁ గొన్ని సందర్భముల యందు పద్యములకంటెను, వచనములకంటెను పాటలే రసజనకము లగునని నాకుఁదప్పని యభిప్రాయము. కాఁబట్టియే యీనాటకము తృతీయాఙ్కము తురీయరంగమున పీరనాయకునకుఁ గావించి యుండిన "మెగంబులను రేవగల్" అనుపాట నట్లనే నిలిపి యున్నాఁడ."

# సంచార ప్రదర్శనాలు

స్థానికులందరి అభిమానాన్ని చూరగొని, ఇంట గెలిచిన సరసవినోదినీ సభవారు 1891 వ సంవత్సరం జూన్ నెలలో ప్రప్రథమంగా మద్రాసు విక్టోరియా పబ్లిక్ హాలులో ప్రదర్శనాలొసంగినారు. ఒకనాటి నాటక ప్రదర్శనాన్ని గూర్చి, మద్రాసు సుగుణవిలాసభ స్థాపనాన్ని గూర్చి తమిళనాటక పితామహులైన రావుబహదూర్ శ్రీ పి. సంబందం మొదలియార్ ఇట్లా వర్ణించినారు[5] —

"రెండు తరాలనాటిమాట. 1891 వ సంవత్సరం జూన్ నెల కడపటివరకు తమిళనాటకాలంటే, తమిళనటకులంటే నాకు చాల జుగుప్స ఉండినది. ఆ సంవత్సరం జూన్ నెలలో ఒకరాత్రి ఈ జుగుప్స, నేనే తమిళనాటకాలను రచించి నటించవలెననే ఆశ, అభిలాషగా పరిణమించింది. ఈ పరిణామానికి నామనసులో నారులుపోసినవారు శ్రీ ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు ......

"ఆనాటి నాటకం చిరకారినాటకం. నన్ను ఆ నాటకం విషయంలో నేడు పరీక్షచేసినా ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణుడను కాగలను.

---

5. "పరిశోధన" (ఆంధ్రనాటక పితామహ సంస్మరణ సంచిక)-డిశంబరు - జనవరి, 1955

అంత గాఢంగా ఆ నాటకం నా హృదయంలో, మనస్సులో, మేధలో హత్తుకుపోయింది. కృష్ణమాచార్యులుగారు రాజుపాత్ర ధరించి నారు. చాలబాగా నటించినారు. గోపాలాచార్యులుగారు మోహిని వేషంవేసినారు. బి. మాధవరావుగారు విదూషకవేషం ...... అంత వరకు నేను చెన్నపురిలో తమిళ తెరుక్కూత్తు చూచినవాణ్ని. ఆ తెరుక్కూత్తులలో (వీథినాటకాలలో) అభాసపు వేషాలతో, ముఖా లకుమాత్రం హరిదళం పులుముకొని దుమికిదుమికి ఆడే నటుల వింత పోకడలకు వెగటు పుట్టిన నాలో ఆరాత్రి చక్కని రంగస్థలంపైన, సరైన, సహజమైన వేషాలతో, మంచి సంగీతంతో విద్యావంతులు నటించడం చూచి నాలుగుగంటలలోనే పరకాయప్రవేశం జరిగినంతగా మార్పుకలిగింది.... నేనుకూడా ఇటువంటి నాటకం వ్రాసి, స్వయం నటించాలనే ఆశపుట్టింది.

"ఇది జరిగింది శనివారం. ఆనాటినుంచే కృష్ణమాచార్యులు గారికి నేను ఏకలవ్యశిష్యుణ్నయాను. మర్నాడు తమిళంలో ఇలాంటి నాటకాలున్నవేమోనని పరిశీలించినాను. అప్పటికి తమి ళంలో ఉన్న నాటకాలు రెండే — హరిశ్చంద్ర, డంబాచారి విలాసం. రెండింటినీ శ్రద్ధగా చదివాను. కాని యెంతమాత్రమూ తృప్తి కలుగ లేదు. నేను వెనుకదినం చూచిన చిరకారిస్థాయికి కాదుగదా, ఆ పరి సరాలకు కూడా రాదగిన స్థలంలోలేవు..... నావలె చిరకారి నాట కాన్ని చూచిన నామిత్రులు నలుగురైదుగురు బళ్ళారి సభవంటిది మద్రాసులోను నెలకొల్పాలని నాతో ఆలోచన జరిపినారు. నాకు అంతకన్నా కావలసింది యేముంది? 1891 జులై 1 వ తేదీన "సుగుణవిలాససభ" స్థాపించినాను. బళ్ళారి సభ పేరు సరసవినోదినీసభ కదా! దాని పుటాక్షరాలు ఇంగ్లీషులో ఎస్. వి. ఎస్. అలాటి పుటాక్ష రాలే ఉండవలెననే దృష్టితో సుగుణవిలాసభ — ఎస్. వి. ఎస్ — అని నామకరణం చేసినాను. అంతవైరిభక్తి మాకా బళ్ళారి నాటకసభపైన.

సుగుణవిలాససభలో నేను 63 సంవత్సరాలకు పైగా నాటకాలు వ్రాసి ప్రదర్శించినాను. దీనికి దోవచూపినవారు కృష్ణమాచార్యులుగారు. కాబట్టే వారిని నేను గురువుగా భావించినానని ఆరంభంలో చెప్పి నాను ......

"......కృష్ణమాచార్యులవారి అభినయంతోపాటు వాచికం అత్యద్భుతం. తమిళుడైన నాకుకూడా అర్థమయ్యేంత స్పష్టంగా ఆ ఉచ్చారణ ఉండేది. ఆ గంభీరపద్యాలు కూడా వారు విరిచి చద వడంలో అర్థమయ్యేవి. ఈ విషయంలో తమిళనటులకు — వారు కోపం చేసుకున్నా సరే— సలహా ఇవ్వదలచాను. ఆంధ్రనటులవలె స్పష్టోచ్చా రణ, స్పష్టవాచికం నేర్చుకోవాలి, నన్నుతిట్టి ప్రయోజనంలేదు.....

"1928 లో నేను స్మాల్ కాజ్ కోర్టు జడ్జిపదవినుండి విరమించి నప్పుడు నాస్నేహితులందరూ "మరల వకీలువృత్తి చేయండి" అని కోరినారు. కొందరు నిర్బంధించినారు. కాని కృష్ణమాచార్యులుగారి మాట ప్రకారం ఆనాడు మొదలు నేటివరకు నాజీవితమంతా తమిళ నాటక రచనకు, ప్రదర్శనకు అంకితం చేసినాను. ఉద్యోగంనుంచి విర మించిన తర్వాతనే 45, 46 నాటకాలు వ్రాసినాను. ఇదంతా ఆచార్యులుగారి చలవే. ఇంతవరకు 97 నాటకాలు రచించినాను".

తమిళనాటక పితామహుని పై వాక్యాలనుబట్టి ఆధునిక తమిళ నాటక రచనా ప్రదర్శనాలకు తెలుగువారే మార్గదర్శకులనే సత్యము స్పష్టమవుతున్నది.

అట్లా 1891 జూన్ నెలలో కొన్ని నాటకాలను విజయ వంతంగా ప్రదర్శించి, సరసవినోదినీసభవారు బళ్ళారికి తిరిగివెళ్ళే

సమయంలో మద్రాసులోని ప్రముఖులు కొందరు కిందివిధంగా సన్మాన పత్రం సమర్పించినారు[6]—

Dear Sir,

We, the undersigned Citizens of Madras have much pleasure in decorating your President with a Jewelled Medal as a token of our esteem and placing in your hands this tribute of our admiration of your rare triumphs in the histrionic art in our midst. The fame of your excellence, stimulated, developed and sustained, as it has been, by the self denying exertion and impassioned enthusiasm of your worthy President Mr. D. Krishnamacharyulu, had travelled before you and prepared us for untasted visions of delight; and we assure you that our actual experience has fully realised our anticipation.

" In the composition of the plays which you acted before us, a high moral tone is scrupulously maintained, and the happy mean between the scholarly diction and the people's style is skilfully hit and uniformly observed, without the least lapse from accuracy, and the elocution that marked your vivid reproduction of the several pieces has borne ample testimony to your

---

6. ఈ సన్మానపత్రాన్ని సమర్పించిన వారిలో శ్రీయుతులు పి. చంచల రావు, రావు బహదూర్ పి. ఆనందాచార్యులు, డా. గస్టవ్ ఆపర్ట్, పిఠాపురం కుమారరాజా, మొదలగువారు కలరు. ఈ విషయంతో పాటు సభ సంక్షిప్త చరిత్ర 27-7-1907 తేదీనాటి "స్టాండర్డ్" పత్రికలో ప్రకటింప బడింది. చూ. అథస్సూచిక - 10.

unrivalled talents and the hidden capabilities of the Telugu language alike."

మద్రాసుయాత్ర జయప్రదంకావటంతో సరసవినోదినీసభ వారు ప్రతి సంవత్సరం వేసవి సెలవులలో మద్రాసువెళ్ళి నాటకాలను ప్రదర్శించటం మొదలుపెట్టినారు. అటు కన్నడదేశంలో, ముఖ్యంగా బెంగుళూరులో కూడా ప్రదర్శనాలిచ్చినారు. ఒకసారి నెల్లూరులో కూడా ప్రదర్శించినారట. ఎచ్చటికి వెళ్ళి ప్రదర్శనలిచ్చినా ప్రజల, పత్రికల పొగడ్తలను వారు పొందుతూనే ఉండిరి.

గోపాలాచార్యులు గారు నారాయణదేవరకెరె విడిచిపెట్టి కొంతకాలం బళ్ళారిలో ప్రాక్టీసుచేసినారు. తరవాత, 1900 కు పూర్వమే హైదరాబాదు చేరినారు. రెసిడెన్సీబజారులో, బెల్లం కొండ రాజావారి దేవిడీలో నివాసము. నాటక రచనలోను, న్యాయ వాద వృత్తిలోను గోపాలాచార్యులుగారు అన్నతో సమానమైన చేయి అని చెప్పవచ్చు. గోపాలాచార్యులుగారు బళ్ళారిలోకంటె హైదరాబాదులోనే ఎక్కువ రాణించినారు. హైదరాబాదులో ఒక నాటక సమాజాన్ని స్థాపించి, మరల తెలుగు నాటకరచన సాగించి నారు. తమ్ముని ఆహ్వానంమీదనే 1905 మే నెలలో ఆచార్యుల వారు ప్రప్రథమంగా హైదరాబాదు వచ్చి సరసవినోదినీ సభ పక్షాన ప్రదర్శనలిచ్చినారు. ఇంచుమించుగా 45 రోజులు సభవారంతా హైదరాబాదులోనే ఉన్నారు. వారానికి రెండు ప్రదర్శనాలిచ్చి నారు. సికింద్రాబాదు జేమ్సువీథిలోఉన్న గిరిగిరి బంగళాలో సభ వారు విడిదిచేసినారు. సికిందరాబాదు నాగన్న దేవిడీలోను, హైదరా బాదు అబీద్ సెంటర్ ప్రాంతంలో ప్రత్యేకంగా నిర్మించిన నాటక

శాలలోను ప్రదర్శనాలు జరిగినవి. హైదరాబాదులోని నగరదాపద్ధతి వల్ల తొలుత స్త్రీలు నాటకాలు చూసేవారుకాదు. కాని నాటక ప్రదర్శనాలు అత్యద్భుతంగా ఉన్నవనే వార్త నగరమంతటా వ్యాపించటంతో స్త్రీలుకూడా రావటం మొదలుపెట్టినారు; అప్పుడు వారి కొరకు అడ్డంగా తెరలు కట్టేవారు. క్రమక్రమంగా స్త్రీల సంఖ్య పెరగడంతో తుదకు 'సావిత్రీ చిత్రాశ్వము' అనే నాటకాన్ని ఒక రోజు కేవలం స్త్రీలకోసమే ప్రదర్శించినారట; ఆనాడు పురుషులకు ప్రవేశంలేదు.

సరసవినోదినీసభవారు 1910 మే నెలలో ఇంకోసారి హైదరాబాదు వచ్చినారు. అప్పుడు మిత్రుల బలవంతంవల్ల ఆచార్యులవారు హరిశ్చంద్రనాటకాన్ని 3 రోజులలో వ్రాసినారు; 23-5-1910 తేదీన ప్రారంభించి, 25-5-1910 తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ముగించినట్లు దీని వ్రాతప్రతిమీద ఉంది. ఆచార్యులవారు పచారుచేస్తూ, ఆశువుగా చెబుతూఉంటే కప్పగల్లు భీమసేనరావుగారు వ్రాత ప్రతిని వ్రాసినారట. భీమసేనరావుగారు ఆచార్యులవారికి చాలా సన్నిహితులు; వారితోనే ఎక్కువకాలము గడిపినవారు. ఆచార్యులవారు మొదటిరోజులలో తమ నాటకాలకు తామే ప్రతులను వ్రాసుకొనేవారు. తరవాత వ్రాయసగానిని కుదుర్చుకొని, పచార్లుచేస్తూ ఆశువుగా చెప్పేవారు. కొన్ని నాటకాలకు మొదటి ప్రతులను భీమసేనరావుగారే వ్రాసినారు. అంతేకాదు, భీమసేనరావుగారు 'ప్రాంప్టర్' గా కూడా పనిచేసినారు. బళ్ళారిలో ఉన్నప్పుడు ఆచార్యులవారు తెల్లవారుజామున 4 గంటలకే లేచి, తమగదిలో నేలమీద ప్రత్యేకమైన దిండును ఆనుకొని, నాటకరచన కుపక్రమించేవారట. మొదటిప్రతి తయారుకాగానే మరిరెండుమూడు

ప్రతులు వ్రాయించేవారట. అట్లా తయారైన తొలిప్రతులు వచన రూపాలు మాత్రమే! పాటలు, పద్యాలు తరవాత చేర్చేవారు. ఆచార్యులవారి నాటకరచనా విధానాన్నిగూర్చి కప్పగల్లు సంజీవ మూర్తిరావుగారు (భీమసేనరావుగారి కుమారులు) ఇట్లా వర్ణించి నారు[7]—

"ఆచార్యులవారి తరువాతి నాటకరచనా విధానమునందొక ప్రత్యేకమార్గ మేర్పడుట గమనింపదగినది. తాము మొట్టమొదట వ్రాసిన నాటకములలో పాత్రలు ధరించు క్రొత్త నటకుల ప్రత్యేక యోగ్యతలను, ప్రతిభలను గణించి, ఆవల వారికి దగిన పాత్రముల సృజించి నాటకములు వ్రాయుచు, ఆయాపాత్రధారులచే ఆనాటకము లాడించుచుండిరి. ఈ నాటకములు వ్రాయుటలో నింకొక విశేషము. ఒక నాటకమునకు ప్రణాళిక నేర్పఱచుకొని, ఒక మంచి విలేకరిని వేకువజామున తమ యింటికి రా నియమించి, తాము పచారు చేయుచు ఆశువుగా సంభాషణములు చెప్పుచుండగా, ఆవ్రాయసకాడు వ్రాయుచుండెడివాడు. అది అంతయు అప్పటికి వచనరూపము. నాటకము వ్రాయుట ముగిసినపిదప, తా మొక్కసారిచూచి ఆవశ్యక మేని అందందు ఒకటిరెండు సవరణలు గావించి, తమకు వలసిన చోట పద్యములను, పాటలను చేర్చి, ఆపై సభ్యులందఱిని సమావేశ పఱచి ఆనాటకమును చదివి వినిపించి, వారిలో నెవరైన తెలిసిన వారు ఏవైన సలహాలిచ్చినయెడల అవి తమకు నచ్చెనేని వాని స్వీక

7. "పరిశోధన" (ఆంధ్రనాటక పితామహ సంస్మరణ సంచిక)- డిశంబరు - జనవరి, 1955, పుట 9.

రించుచుండిరి. తమదే సిద్ధాంతమును మొండిపట్టు వారికి లేదు. ఆవల నటులకు పాత్రల పంచిపెట్టి వారి వారి యోగ్యతానుసారముగ పద్యములను, పాటలను మఱి రచించి యిచ్చుచుండిరి."

1910 సంవత్సరంలో హైదరాబాదులో నాటకాలు ప్రదర్శిస్తున్నప్పుడే గద్వాల మహారాజావారు ఆచార్యులవారికి "ఆంధ్ర నాటక పితామహ" అనే బిరుదు ఇచ్చి సత్కరించినారు. ఈ విషయాన్నిగూర్చి, కప్పగల్లు సంజీవమూర్తిరావుగారు 12-4-1958 తేదీన నాకు వ్రాసిన లేఖలో ఇట్లా తెలిపినారు—

"సరసవినోదినీసభవారు హైదరాబాదునకు 1910 సం॥ న నాటకముల ప్రదర్శింపనరిగి యుండిరి. అక్కడ అదివరకే శ్రీ ఆచార్ల వారి సోదరులు—రామదాసు మున్నగు నాటకములను వ్రాసిన వారగు శ్రీ గోపాలాచార్యులుగారు పబ్లిక ప్రాసిక్యూటర్‌గా ఉండిరి. వారి తోడుపాటున అక్కడ సభవారి నాటకములు అత్యద్భుతముగా ప్రదర్శింపబడి పండిత పామరుల మెప్పుబడయ గలిగినవి. గద్వాలమహారాజుగారికి తొలినుండియు సరసవినోదినీసభానాటకములన్న మిక్కిలి ఆదరాభిమానములు. ఈ సభవారు సెలవులలో మద్రాసునకు పోయినప్పుడెల్ల శ్రీ రాజావారు అక్కడికే పోయి ముందుగా టిక్కెట్లను రిజర్వుచేసి యుంచుకొను చుండెడివారట. కావున వారు తమ మెప్పునకంత పాత్రమైన సభ హైదరాబాదునకే వచ్చి యుండుటయు, అంత జనాకర్షకముగ నాటకములను ప్రదర్శించుటయు జరిగినప్పుడు ఆ సన్నివేశమును వృథాపోనీయకుండ ఎల్లప్పుడును తమతోడనుండు పండితులను, ఇతర పండితులను సమావేశపఱచి, ఆ సమావేశమున శ్రీ ఆచార్లవారికి "ఆంధ్రనాటక

పితామహా" బిరుదముతోకూడ బంగారు కంకణాదులను అందజేసి రని తెలియుచున్నది. ఆయూరి ప్రముఖులు శ్రీ ఆచార్యుల వారికి ఒక రత్నఖచిత కిరీటమును బహూకరించినట్లును తెలియు చున్నది."[8]

8. ఈ బిరుదప్రదానము 1910 లోనే జరిగినట్లు 'ఆంధ్రరచయితలు' (పుటలు–111-12 లో కూడ కలదు. ఆచార్యుల వారు తమ 'ఆంధ్ర నాటకపితామహా' బిరుదమును ఒక్క 'పాదుకాపట్టాభిషేక నాటక' ప్రస్తావనలో మాత్రమే పేర్కొనిరి. 20-6-1908 తేదీన చిత్ర నళీయ నాటక చతుర్థ ముద్రణమునకు వ్రాసిన పీఠికలో "సావిత్రీ చిత్రాశ్వము, పాదుకాపట్టాభిషేకము, విషాద సారంగధరము అను నాటముల ప్రకటింపనుద్యమించి పాటుపడుచున్నాడ" అని తెలిపి నారు. ఈ మూడింటిలో పాదుకాపట్టాభిషేక ముద్రణము 1910 చివరగాని తరవాతగాని జరిగి ఉండును.

# రామకృష్ణ విలాస్

రిహార్సల్సు జరిపించటంలో, ప్రదర్శనాలు సాగించటంలో ఆచార్యుల వారి క్రమశిక్షణకు చాలామంది తట్టుకోలేకపోయినారు. అందుచేత కొందరు సరసవినోదినీసభను వదలివేసినారు. సొంత మేనల్లుడు అయిన రాఘవాచార్యులుగారు కూడా ఇట్లాగే సరసవినోదినీ సభను విడిచివెళ్ళినారట. ఈ విషయాన్నిగూర్చి ఆచార్యులవారి నాల్గవ కుమారులు శ్రీ వేణుగోపాలాచార్యులుగారు ఇట్లా వ్రాసినారు[9]—

"...... శ్రీ రాఘవ మాతండ్రిగారి న్యాయవాదవృత్తిలో చాల సన్నిహితులు. మాతండ్రిగారికి మాపినతండ్రి వేంకటకృష్ణమాచార్యులకంటే శ్రీ రాఘవ అంటేనే ఎక్కువ నమ్మకం, ఆదరం ఉండేవి. కాని నాటకాల విషయం వచ్చేటప్పటికి శ్రీ రాఘవ మాతండ్రిగారికి. పోటీగా శ్రీ కోలాచలం శ్రీనివాసరావుగారు స్థాపించిన 'సుమనోరమసభ'లో చేరినారు. సుమనోరమ సభపై శ్రీరాఘవకున్న మక్కువను మాతండ్రిగారు తరచు ఎత్తిపొడిచి ఎగ

---

౯. "పరిశోధన" (ఆంధ్రనాటక పితామహుని సంస్మరణసంచిక) డిశంబరు-జనవరి, 1౯55. పుట 1౩.

తాళి చేసేవారే; కాని ఉభయులకూ స్నేహంమాత్రం చెడలేదు. పరస్పర దృక్పథాలను గౌరవించుకొని మైత్రిచే మెలిగేవారు. రసవత్తరమైన వాచికం, తదనుగుణమైన హావభావాలను ముఖంలో మూర్తీభవించేటట్లు చేయడం ముఖ్యమని శ్రీ రాఘవమతం. మాతండ్రిగారు ఈ రెంటినీ అంగీకరిస్తూ సంగీతంకూడా జోడించాలనేవారు. శ్రీ రాఘవకు సంగీతం రాదు. కాని మానాయనగారు సంగీతకళానిధి. నాటకాలలో శ్రావ్య సంగీతానికి పీటవేసినారు. తమ సరసవినోదినినాటకసభలో గాయకులను ఎక్కువగా ప్రోత్సహించినారు. మా తండ్రిగారు మరికొంతకాలం జీవించిఉంటే వారిద్దరూ—శ్రీ రాఘవ, మా తండ్రిగారు-సంగీతాభినయాల మేలు కలయికతో ఆ రోజుల్లోనే - ఆంధ్రనాటకకళ శైశవావస్థలో వున్న ఆ రోజుల్లోనే - అత్యున్నత నవ్యనాటక కళారీతిని రూపొందించేవారేమో!"

అట్లా సరసవినోదినీసభ నుంచి వేరుపడిన కొందరు శ్రీ పద్మనాభివెంకోశాచార్లు అనేవారి నాయకత్వంలో 'మనోరమ' అనే సభను స్థాపించినారు. అందులో శ్రీ వెంకోశాచార్లు వ్రాసిన 'లోకదర్పణము', మరికొన్ని ఇతర నాటకాలు ప్రదర్శిస్తూ ఉండేవారు. కాని వారి ప్రదర్శనాలు సరసవినోదినీ సభవారి ప్రదర్శనాలముందు ఎందుకూ కొరగానివిగా ఉండేవట. అంతటవారు, ఆచార్యులవారితో సమానమైన వ్యక్తిని వెదుకసాగినారు. అప్పుడు వారికి శ్రీ కోలాచలం శ్రీనివాసరావుగారు లభించినారు. శ్రీనివాసరావుగారు సుప్రసిద్ధ న్యాయవాదులేకాక, మంచి రచయితలుకూడా. మనోరమసభవారంతా కోలాచలంవారిని అధ్యక్షులుగా ఎన్నుకొని, మనోరమసభ పేరును, 'సుమనోరమసభ'గా మార్చుకొన్నారు. ఈ సుమనోరమసభ 1902లో స్థాపించబడినట్లు తెలుస్తున్నది.

సుమనోరమసభవారు రెండుమూడు నాటకాలు సరసవినోదినీసభ వారి హాలులోనే వేసినారు. అవి బాగా రక్తికట్టినవి. తరవాత సరస వినోదినీసభవారు తమహాలు ఇవ్వటానికి అంగీకరించలేదు. అప్పుడు కోలాచలంవారు పట్టుదలతో పనిచేసి, ఒకచక్కని నాటకశాలను సుమనోరమసభవారికి ప్రత్యేకంగా కట్టించినారు. దీనిపేరు 'వాణీ విలాస నాటకశాల'. 1905లో శ్రీ బాలగంగాధరతిలక్ ఈ నాటక శాల ప్రారంభోత్సవం చేసినారు. బళ్ళారిలో ఇదే తొలినాటకశాల; అంతకుముందు పాకలలోనే నాటకాలు ఆడేవారు. దీనితో సరసవినో దినీసభా సభ్యులు కలవరపాటుతో మేల్కొన్నారు. మొదటినుంచీ సరసవినోదినీ సభవారు తాము ప్రత్యేకంగా నిర్మించుకొన్న తాటి ఆకుల హాలులోనే నాటకాలు వేసేవారు. ఆ స్థలము ఒక లింగాయత మఠమువారిది; 60 సంవత్సరాల అద్దెకు తీసుకొన్నారు. అందు లోనే చక్కని నాటకశాల నిర్మాణానికి పూనుకొన్నారు. మిలిటరీ వారు వేలంవేస్తున్నప్పుడు కొన్నపరికరాలు చాలా చవకగా గిట్టినవి. మొత్తంమీద నాటకశాలనిర్మాణానికి రూ. 8 వేలు ఖర్చుఅయినవి; ఇందులో రు. 6వేలు ఆచార్యులవారి పెట్టుబడియే (తరవాత నాటక ప్రదర్శనాలవల్ల వచ్చిన ఆదాయంతో సభవారు 2, 3 ఏండ్లలోనే ఆరు వేలఅప్పు తీర్చివేసినారట.) నాటకశాలనిర్మాణము సగంలో ఉండగా ఎవరో స్థిరమైన నాటకశాల కట్టరాదని నిషేధపుటుత్తరువు న్యాయ స్థానంనుంచి తీసుకొనివచ్చినారట; కాని అది నిలిచినట్లులేదు.

27-7-1907 తేదీన డాక్టర్ టి. యమ్. నాయర్ ఈ కొత్త నాటకశాలకు ప్రారంభోత్సవం చేసినారు.[10] వారు తమ ఉపన్యాసంలో పాశ్చాత్యనాటకచరిత్రను వివరించి, "200 ఏండ్లలో ఆంగ్లనాటక

---

10. ఈ ప్రారంభోత్సవాన్ని గూర్చిన వివరాలు "The Standard" అనే పత్రికలో 27-7-1907 తేదీతో విపులంగా ప్రకటితమైనవి.

రంగం సాధించిన ఫలితాలను ఆచార్యులవారు 20 ఏండ్లలో సాధించి నారు'' అని ప్రశంసించినారు. ఆ మహాసభలో కొత్తనాటకశాలకు ఆచార్యులవారిపేర ''రామకృష్ణవిలాస్'' అనే పేరు పెట్టవలెనని ఒక తీర్మానాన్ని టి. శామారావుగారు ప్రవేశపెట్టినారు. దొడ్డి గోవిందరావుగారు బలపరచినారు. గౌడ్‌గారు కన్నడంలోను, ఎమ్. సీతారామారావుగారు తెలుగులోను మాటాడి ఈ తీర్మానాన్ని బలపరచినారు. తీర్మానము ఏకగ్రీవంగా ఆమోదింపబడింది. జోష్‌గిరి ఆచారిగారు వేదపఠనంచేసినారు. ఆచార్యులవారి సోదరులు శేషా చార్యులుగారు కార్యదర్శినివేదికను చదివి, సభచరిత్రను సంక్షిప్తంగా వివరించినారు. తొమ్మిదిమంది సాహిత్యపరులు వరుసగా నవరత్నమాలి కను చదివినారు.[11] సభ ముగిసినపిమ్మట సరసవినోదినీసభవారిచేత ''ఉదసాకల్యాణము'' ప్రదర్శింపబడినది. 'ఉ' అనగా 'ఉష', 'ద' అనగా 'దమయంతి', 'సా' అనగా 'సావిత్రి' - ఈ మూడు నాటకాల లోని కల్యాణ ఘట్టాలను చమత్కారంగా కూర్చి, ఆనాడు ప్రదర్శించి నారు.

'రామకృష్ణ విలాస్' తో బళ్ళారిలో రెండు చక్కని నాటక శాలలు ఏర్పడినవి.[12] కాని క్రమక్రమంగా సరసవినోదినీసభవారికి

---

11. ఈ నవరత్నమాలికను ఆచార్యులవారే రచించినారు. ముద్రితము. తొమ్మిదిపద్యాలకు నవరత్నాలపేర్లు పెట్టినారు. ఒక ఉదాహరణము: వైడూర్యము:

చం॥ ఇరువదియేండ్లకే నలువురేవురు పుత్త్రిలఁగాంచి వార్ధకం
బరుదుగఁజెంది తూఁగు నల హైందవ భూసుర భామవోలెఁగా
కరసి ప్రతీచినున్న వసుధాధిపకన్యలఁబోలెఁ బెంపుమై
సరసవినోదనీతరుణి చందమెసంగఁగ వృద్ధిఁజెందుమా.

12. ఈ నాటకశాలలురెండూ నేడు సినిమా శాలలు అయినవి. రామకృష్ణవిలాస్ నేటి "స్టార్ థియేటర్;" వాణీవిలాస్ నేటి "ప్రభాత్ టాకీస్".

సుమనోరమసభవారికి స్పర్థలు పెరిగి, వైషమ్యాలకు దారితీసినవి. ఒకరు నాటకము ప్రదర్శింపదలచి ప్రకటన చేసిన వెంటనే, రెండవ వారు కూడా సరిగా అదే రోజున నాటక ప్రదర్శనకు పర్పాటు చేసే వారు. ఒక నాటకశాలకు వెళ్ళదలచుకొన్న ప్రేక్షకులను, దారిలో చిత్ర విచిత్రాలైన వినోదాలు కల్పించి, రెండోనాటకశాలకు మరలు నట్లు చేసేవారట. ఇట్లా అంతరంగికంగా వైషమ్యాలున్నా, అసలు పెద్దలు మాత్రము పెద్దమనుషులు గానే ప్రవర్తించేవారు. తానూ, ఆచార్యులవారు సుహృద్భాషణములొనరించుచున్నట్లు కోలాచలం వారు తమప్రహ్లాదచరిత్ర నాటక పీఠికలో వ్రాసుకొన్నారు. రాఘవా చార్యులుగారు 1905 కు పూర్వమే సుమనోరమసభలో చేరి, నాయక భూమికలను ధరిస్తూ, ఆ సభకు జీవగర్రగా ఉన్నప్పటికీ అసలు జీవితంలో మాత్రం ఆచార్యులవద్ద జూనియర్ వకీలుగా పని చేసేవారు.

ఈ సభలమధ్యగల స్పర్థ ఊరిలో విచిత్రమూ, సంతోషకరమూ అయిన ఒక పరిణామానికి దారితీసినది; అచ్చట కేవలము స్త్రీలనాటక సమాజాలు రెండు బయలు దేరినవి. ఒకటి 'కృష్ణమాచార్యులసభ;' రెండోది 'శ్రీనివాసరావు సభ' (అసలు పేర్లు తెలియరాలేదు). కృష్ణ మాచార్యులు సభవారు ఆచార్యులవారి నాటకాలను, శ్రీనివాసరావు సభవారు కోలాచలం వారి నాటకాలను ప్రదర్శించేవారట. తరవాతి కాలంలో ఒక సభవారు పండిత కె. సుబ్రహ్మణ్యశాస్త్రిగారు రచించిన కృష్ణలీలలు, లవకుశ మొదలైన నాటకాలు కూడా ఆడుతూ ఉండే వారట. ఈసభలు ఆచార్యులవారి మరణానంతరం బయలుదేరినవని కొందరు చెప్పినారు. కాని, ఆచార్యులవారి జీవిత కాలంలోనే ఇవి వెలసినట్లు, ఒకసారి ఆచార్యులవారి సమక్షంలో ఒక స్త్రీ బాహుక భూమిక ధరించి, అభినయంలో వారిప్రశంసలు పొందినట్లు ఆచార్యుల వారి మూడవ కుమారులగు రంగాచార్యులవారు చెప్పినారు.

ఈ సభా సభ్యులంతా స్త్రీలే; అందున కళావంతులు మాత్రమే. స్త్రీలే పురుష వేషాలు కూడా ధరించి, చక్కగా అభినయించేవారు. అసలు సభల వారికి పరస్పరం వైరమున్నట్లే ఈ సభలవారి మధ్య కూడా వైరం ఉండేదట.

22-6-1911 తేదీన భారతదేశమంతా ఐదవ జార్జి రాజ్యాభిషేకోత్సవం జరుపుకొన్నది. ఆనాడు బళ్ళారి పౌరులు జరుపుకొన్న ఉత్సవంలో నాటక ప్రదర్శనం అత్యద్భుతమని చెప్పక తప్పదు. ఈ సందర్భం నిమిత్తం ఆచార్యులవారు ప్రత్యేకంగా రచించిన 'రాజ్యాభిషేక' మనే 5 రంగాల నాటకాన్ని ఆనాడు సరసవినోదినీసభవారుచాలా వైభవోపేతంగా ప్రదర్శించినారు. ఆ ప్రదర్శనాన్ని ప్రశంసిస్తూ 28-6-1911 తేదీన ఆంధ్రపత్రిక, 29-6-1911 తేదీన హిందూపత్రిక వ్యాసాలు ప్రచురించినవి ఇంగ్లండులో జరిగిన పట్టాభిషేక వైభవాన్ని చూడజాలని భారతీయుల కొరకు 'ఇది వరకెన్నడును కనివిని యెఱిగి యుండని భంగి ఒక నాటకమును రచించి ప్రదర్శన కావింతుము' అని సరసవినోదినీసభవారు ప్రకటించి, అట్లే ప్రదర్శన ఇచ్చినారు. ఆ నాటక కథా సంగ్రహము: ఆంగ్లేయ పాలనకు పూర్వము హిందువులు మహమ్మదీయులచేత పీడింపబడుచు చికాకు పడుచుండిరి. అది చూచి, హైందవమాత దుఃఖించి, విష్ణువుతో మొరపెట్టుకొనెను. అంతట విష్ణువు 'సుగుణ' అనే కన్యను పిలిచి, నీవింగ్లాండులో శ్రీ విక్టోరియా రాజ్ఞిగా అవతరింపుము అని ఆదేశించి పంపెను. 'ఆమె పాలనలో ఆమెకు లోబడి, అంతఃకలహాదులు లేకుండ సుఖముగా నుండుము' అని హైందవ మాతను ఆదేశించెను. ఆ కారణంగా హిందువులు సుఖించుచు పంచమజార్జి ప్రభువు పట్టాభిషేకోత్సవమును చేసికొనుచున్నారు. ప్రదర్శన సమయంలో మహమ్మదీయులు సోమనాథ దేవాలయాన్ని పాడు చేయటం, క్షీర

వారాశి, వైస్రాయి సమక్షంలో దర్బారు తీర్చి అభిషేకోత్సవం జరుపుట మున్నగునవి అత్యద్భుతముగా ప్రదర్శింపబడినవి.

మొదటి రోజులలో అసరసవినోదినీసభవారి ప్రదర్శనాలలో సీనరీ చాలా సామాన్యంగా ఉండేది. తరవాత హైదరాబాదులో ప్రదర్శనాలిచ్చినప్పుడు బొంబాయి నుంచి చాలా పరికరాలు తెప్పించుకొన్నారట. నాటకశాల నిర్మించుకొన్న తరవాత దీనిని ఇంకా బాగా అభివృద్ధి చేసుకొన్నారు. ఆర్. కృష్ణమాచార్యులు అనే చిత్రకారులు తెరలు మొదలయినవి చిత్రించటానికి నెలకు రు. 40 జీతంమీద నియమితులైనారు. ఈ సభలో వీరికి తప్ప ఇంకెవ్వరికిని జీతాలు లేవు.

ఈ సందర్భంలో ఆచార్యులవారి 'పాదుకా పట్టాభిషేక' ప్రదర్శనాన్ని గూర్చి కొంత చెప్పవలసి ఉన్నది. సభవారు ప్రకటన పత్రంలో "No eye is kept dry" (ఈనాటకం చూస్తే కన్నీట తడయని కన్నే ఉండదు) అని సవాలు చేసేవారట. ఇది అసలే కరుణ రసప్రధానమైన నాటకము; ఇంక సభవారి ప్రదర్శనము అత్యద్భుతంగా ఉండేదట. ఇందులో ఆచార్యుల వారే దశరథుడు. ఒకసారి మద్రాసులో కొందరు పెద్దలు ఆ సవాలు అంగీకరించి వచ్చి కూర్చుండిరట. సీతారామలక్ష్మణులు అడవికేగు ఘట్టంలో ఎంతగా శోకముబికివస్తున్నను బిగపట్టి కూర్చుండిరట. కాని దశరథ మరణ ఘట్టంలో మాత్రము ఆచార్యులవారి వాచిక, ఆంగిక, సాత్త్వికాభినయములు అనుభవంలోనికి వచ్చినప్పుడు మాత్రము వారిక దుఃఖమును ఆపుకొనజాలక పోయిరట. నాటక ప్రదర్శనాంతమున, రంగస్థలము మీద వారీవిషయమును వెల్లడించి, ఆచార్యుల వారి నటనా ప్రావీణ్యాన్ని అభినందించినారు. ఆ ఘట్టంలో ఆచార్యులవారి అభినయము చాలా సహజంగా ఉండేదనీ, మృతుడైనట్లు పడిపోగానే ఆచార్యుల వారు నిజంగానే చనిపోయినారని తలంచి కొందరు

మిత్రులు దుఃఖించటం జరుగుతూ ఉండేదనీ పెద్దలు చెబుతుంటారు. ఒకసారి చిలంబి ఆది నారాయణప్ప నాయడుగారు (అధికార విరామముపొందిన పోలీసు ఇన్‌స్పెక్టరు) ఆ ఘట్టాన్ని చూచి, ఆచార్యులవారు నిజంగానే మరణించినారనే దుఃఖంతో మూర్ఛపోయినారట.[13]

సరసవినోదినీ సభవారు ప్రతిసంవత్సరం సెలవులలో మద్రాసు వెళ్ళి అక్కడ ప్రదర్శనలిస్తూనే ఉన్నారు. సహజంగా ఎప్పుడూ ప్రశంసలనే పొందుతూ ఉండేవారు. కాని ఎప్పుడేనా ప్రదర్శనం బాగా లేకపోయినా, నటులు అశ్రద్ధగా ఉన్నా తీవ్ర విమర్శకు గురికావటం కూడా జరిగేది. 8-1-1910 తేదీన "Indian Patriot" అనే పత్రికలో ఒక విమర్శకుడు వ్రాసిన సుదీర్ఘమైన లేఖ ఇందులకొక తార్కాణము (చూ. అనుబంధము-2)

వృద్ధులుకావటంచేత ఆచార్యులవారు క్రమంగా వేషధారణము మానినారు. కాని, ఎప్పుడేనా పురజనుల కోర్కెను మన్నించి బాహుక భూమికను మాత్రం ధరించేవారట. అంటే నలభూమికను వేంకట కృష్ణమాచార్యులు గారు ధరిస్తే బాహుక భూమికను ఆచార్యులవారు ధరించేవారన్నమాట. కాగా ఒకే భూమికను, ఒకే ప్రదర్శనంలో ఇద్దరు వేయటం అనేది ఆనాడే ప్రారంభమైనదన్నమాట. కాని బాహుకుని రూపము నలుని రూపానికి పూర్తిగా భిన్నమైనది కాబట్టి, ఇద్దరు విభిన్నవ్యక్తులు ఈ భూమికలను ఒకే ప్రదర్శనంలో ధరించటం సమంజసమే.[14]

---

13. కళాప్రపూర్ణ వేదం వేంకటరాయశాస్త్రిగారి "భారతా భారతరూపక మర్యాదలు" పుట-६8.

14. నలుడు పట్చక్రవర్తులలో ఒకడు; సౌందర్యనిధి. ఇంక బాహుకుడో నన్నయ్య గారు చెప్పినట్లు- అఱపొఱడు కుఱుచ చేతులు నొఱవళరీరంబుఁగలిగి యొరులకుఁ జూడం గొఱగా కుండి"న వాడు - అరణ్యపర్వము - ద్వి. ఆ. 135

## అభినవ సరసవినోదినీసభ

ఈ విధంగా ఆచార్యులవారి నాయకత్వంలో 1912 వరకు సరస వినోదినీసభ నిర్విరామంగా, నిర్విఘ్నంగా కార్యకలాపాలు నిర్వహించింది. కాని, ఆ సంవత్సరం కొందరి సభ్యుల అనుచిత ప్రవర్తనంవల్ల సభ్యులలో చీలికలు ఏర్పడినవి. ఆచార్యులవారు తమ నాటకాలన్నింటిని సరసవినోదినీ సభకొరకే వ్రాసినారు కాబట్టి వాటిపై ఆచార్యులవారికి ఎటువంటి అధికారమూ ఉండరాదని కొందరు సభ్యులొక వాదాన్ని లేవదీసిరి. ఇది ఆచార్యులవారికి బాధాకరమయ్యెను. నాటకాలన్నీ ఆచార్యులవారి స్వీయరచనలే అయినప్పటికీ, ఆ సత్యాన్ని లోకమంతా ఎరిగి ఉన్నప్పటికీ సభతో తనకున్న సన్నిహిత సంబంధం కారణంగా ఆచార్యులవారు ప్రకటన పత్రాలలో కూడా తనపేరు వేసుకొనేవారుకాదు. ఈ విషయం సభవారి కింది ప్రకటన పత్రం పరిశీలిస్తే తెలుస్తుంది. ప్రకటనప్రతాలు ఇంగ్లీషు, తెలుగు - రెండు భాషల్లోనూ ఉండేవి.

The Sarasa Vinodini Sabha
Bellary
The members of the society will give
their performance of
The Brihannala Drama (Recast)

(Composed by one of its members in Telugu)

In their own pavilion

On Saturday the 21 st March, 1896. This drama has been pronounced to be one of the grandest plays of the Sabha.

Printed copies of Chitranaleeyam drama can be had at the pavilion for 1 Re. each copy.

Rates

| Gentlemen | | Ladies | |
|---|---|---|---|
| Reserved Chair | 2-00 | | |
| First class Chair | 1-00 | Chair | 1-00 |
| Second class Bench | 0-8-0 | Bench | 0-8-0 |
| Third class Gallery | 0-4-0 | Gallery | 0-4-0 |

Doors open at 8 p. m. Performance will commence at 9 – 15 p. m. sharp.

Smoking strictly prohibited

The Argument

Act 1

.....................

The Epilogue

C. H. Goud
Stage Manager

D. Krishnamacharyulu
President, S. V. Sabha.

నాటకాలన్నీ సభవారికే చెందుతాయి అనటం ఆచార్యుల వారికి మనస్తాపకారణమైనది. అంతకుముందే గోపాలాచార్యులుగారు హైదరాబాదులో బాగా సంపాదించి, మరల బళ్ళారికి మకాము మార్చినారు. తమ్ముళ్ళతోడ్పాటుతో సరసవినోదినీసభను విడిచిపెట్టి

ఇంకో కొ త్తసభను స్థాపించటానికి నిర్ణయించుకొన్నారు. చివరకు ఆచార్యులవారు స్వీయపుత్రికవంటిదైన సరసవినోదినీసభకు హృదయ భారంతో వీడ్కోలు ఇచ్చి 1912 ఆగష్టునెల ప్రాంతంలో "అభినవ సరసవినోదినీసభ" అనే పేర కొత్త సభను స్థాపించి, రిజిష్టర్ చేసినారు. ఆచార్యులవారి పాతమిత్రులు కొందరు సరసవినోదినీ సభలోనే ఉండి పోయినారు. అందులో, ఆచార్యులవారి తరవాత సి. హెచ్. గాడ్ గారు నాయకత్వం వహించి దానికి ఉపాధ్యక్షులైనారు. ఆచార్యుల వారితో తగవు వచ్చినప్పటికీ వారిమీద గౌరవంచేత 'అధ్యక్షపదవి'ని చాలాకాలం ఖాళీగానే ఉంచినారట. 26 సంవత్సరాల సన్నిహిత సంబంధం తరవాత ఆచార్యులవారు విడిచిపెట్టడంచేత 'సరసవినోదిని' తండ్రిలేనిబిడ్డ అయినదని ఊరిలోని పెద్దలు చాలా బాధపడినారట.

ఆచార్యులవారు పట్టుదలతో మరల కొందరు యువకులను బాలురను తయారుచేసి "అభినవ సరసవినోదినీసభ" పక్షాన ప్రప్రథ మంగా 7-9--1912 తేదీన ప్రహ్లాదను ప్రదర్శించినారు. ఆనాడు ఎక్కువగా బాలురే నటించినారనీ, హిరణ్యకశిపునిగా వేంకట కృష్ణమాచార్యులుగారు అత్యద్భుతంగా, అపూర్వంగా నటించినారనీ 14-9-1912 తేదీనాటి 'స్టాండర్డు' పత్రిక ప్రశంసించినది. కొత్త సభను స్థాపించిరేకాని సొంత పరికరాలు, నాటకశాల లేకపోవటంచేత ఇంతవరకు తమకు వ్యతిరేకంగా ఉన్న సుమనోరమసభ వారినే ఆచార్యులవారు సాహాయ్యము కోరినారు. వారు సంతోషంగా అంగీకరించినారు. అందుచేత పై ప్రదర్శనము సుమనోరమ సభవారి వాణీవిలాసనాటకశాలలోనే జరిగింది. అప్పుడు పాత సరసవినోదినీ సభవారు తమ సొంత భవనంలో 21-9-1912 తేదీన అదే ప్రహ్లాదను ప్రదర్శింతుమని ప్రకటింపగా ఆ తేదీననే చిత్రనళీయాన్ని వాణీ విలాస్‌లో ప్రదర్శింతుమని ఆచార్యులవారు ప్రకటించిరి. దీనితో వైర మధికమై "సరసవినోదినీ సభవారి పేరుగాని, ఆస్తినిగాని ఏ విధంగాను

ఉపయోగించరాదు" అని బి. మాధవరావుగారు ఆ సభ పక్షాన ఆచార్యుల వారిపై అభియోగము తెచ్చినారు. ఈ రెండు సభలవారిని మరల కలుపుటకు పురప్రముఖులెందరో ప్రయత్నించిరట; కాని ఫలములేకపోయెనట.

ఇంతలో ఆలూరు సబ్ మేజిస్ట్రేటు కోర్టులో ఏదో కేసు ఉండటంచేత, వాదించటానికి ఆచార్యులవారు 30-11-1912 తేదీన ఆలూరు వెళ్ళినారు. చాలాకాలం ఆచార్యులవారి పక్కన పాదుకలో శ్రీరాముని భూమిక ధరించిన పడసాల శ్రీరాములుగారు అప్పుడచ్చట మేజిస్ట్రేటు. ఆచార్యుల వారానాడు కోర్టులో వాదిస్తూనే కాలు జారిపడి, "హా! రామచంద్రా!" అంటూ కనులు మూసినారు. పలువురు కుమారులున్నప్పటికీ ఒక్కరూదగ్గరలేని ఆసమయంలో పుత్రతుల్యులగు శ్రీరాములుగారే ఆచార్యులవారి అంతిమ సమయంలో ఉపచారాలు చేసినారు. ఆచార్యువారి ఆకస్మికమరణంతో బళ్ళారిపురమేకాదు, యావదాంధ్రదేశము మహాదుఃఖసాగరమున మునిగిపోయినట్లైనది. బళ్ళారిపురప్రముఖులంతా, తమతమ వైరాలను మరచి, ఆచార్యులవారి భౌతికదేహాన్ని బళ్ళారికి తీసుకొని వచ్చి, పౌరులందరి సమక్షంలో, అంత్యక్రియలు జరిపించినారు పిమ్మట మాధవరావుగారు వేసిన దావా కూడా రాజీ అయినదట.

ఆచార్యులవారు తాము చనిపోవటానికి చాలా ముందుగానే తమ సమాధికోరకు ఒక స్థలాన్ని నిర్దేశించినారట. ఆవిధంగానే వారి అస్థికలపై సమాధి నిర్మితమైనది. ఆచార్యులవారి ధర్మపత్ని శ్రీమతి లక్ష్మీదేవమ్మగారు మరణించిన తరువాత వారి అస్థికలనుకూడా ఆపక్కనే నిక్షేపించి దానిపై కూడా సమాధి కట్టినారు. ఆ సమాధులు రెండూ దూరానికి గుడివలె కనిపిస్తాయి. వాటిపక్కనే ఆచార్యులవారి పేర 'రామకృష్ణస్కూలు' ఉన్నది.

పెక్కు నాటకాలను రచించినప్పటికీ వాటిని ప్రచురించవలెనన్న అభిలాష చాలాకాలంవరకు ఆచార్యులవారికి కలుగనేలేదు. కాని మిత్రులబలవంతంచేత, దేశంలో అడిగిన నాటక సమాజాలకు వ్రాతప్రతులు పంపటం కష్టం గావటంచేత, నాటకాలను ముద్రించటానికి పూనుకొని, ప్రప్రథమంగా 1894 లో చిత్రనళీయాన్ని ప్రకటించినారు. ఇది 1906, 1907, 1908 సంవత్సరాలలో వరసగా మరి మూడు ముద్రణాలు పొందింది. నాటకముద్రణ ప్రయత్నాన్ని గూర్చి ఆచార్యులవారు చిత్రనళీయ ప్రథమముద్రణ పీఠికలోను, విషాద సారంగధర ప్రథమ ముద్రణ పీఠికలోను కింది విధంగా వ్రాసుకొన్నారు. (ఈ భాగాలు కూడా నేటి ముద్రణాలలో కనిపించటం లేదు.)

"సరసవినోదినీసభకై పెక్కునాటకములు రచియింపవలసిన యావశ్యకము కలిగియున్నందునను, ఆనాటకములు గీత భూయిష్ఠములుగా నుండవలసినందునను, ఆగీతములు మాని పద్యములు రచియించి ప్రచురింపించుటకుఁ గార్యాంతరాసక్తుఁడనై నాకవకాశము చాలమిఁ జేసియు, నూరక దాదాపున నిరువది నాటకముల రచించితిఁ గాని రచియించినవాని సవరించి వ్రాయుకాలము చాలక యిదివఱకు నిన్ని యేండ్లైయున్నను నొక్కదానినైన ముద్రింపఁ జాలనైతి. ఇప్పుడించుక యవకాశమొదవియుండినందునఁ గ్రమముగా నొక్కటొక్కటిం బ్రచురింపఁ దలఁపుగొంటిని. దోషజ్ఞులగు సుధీజనులు గుణైక గ్రహణులగుదురని నమ్ముచున్నాఁడ."

— చిత్రనళీయ ప్రథమముద్రణ పీఠిక.

"నా యితరనాటకములు ముద్రితములు కాకుండినను దేశదేశములనున్నవారు అనుమతిమీద వ్రాతప్రతులు తెప్పించుకొనియున్నారు. ఈ మూలమున నాటకసంవిధానముల సంభాషణ

విధానములఁ బలువురెఱుంగుట కాస్పదమయ్యె. దానివలన నా కేమియు లోపము కలుగకపోయినను, నా నాటకములనున్న కొన్ని సంవిధానాది విధానముల నితర కవివర్యులవలనఁ బ్రచురితములైన నాటకముల[15]నే చూచినప్పుడు నాకింత చింత వొడముట కాకర మయ్యె. నాకుఁదోచిన సంవిధానములే యితరులకుఁ దోఁచి యుండిన నుండవచ్చును. అందేమియు దోషములేదు. అయిన నాటకములఁ బ్రచురించినప్పుడు నా సంవిధానక్రమమే యితరుల స్వత్వముగా పాఠకులెక్కడ భావింతురోయను శంక వొదముట కాస్పద మయ్యె. కావున నింక నాటకములఁ బ్రచురించుటకుఁ దడవు సేయుట సముచితముకాదని దోఁచె "సావిత్రీ చిత్రాశ్వము' 'పాదుకా పట్టాభిషేకము', 'విషాదసారంగధరము' అను నాటకముల ప్రకటింప నుద్యమించి పాటుపడుచున్నాఁడనని నాటకాభిలాషులకుఁ జెప్పుట కుత్సాహముకలవాఁడనైతి." (చిత్రనళీయ నాటకము - చతుర్థ ముద్రణపీఠిక - 20-6-1908 )

"నేను రచించిన యాంధ్రనాటకములలో నీ విషాద సారంగధర మాఱవది. రెండవనాటకమయిన సావిత్రీ చిత్రాశ్వము ముద్రాశాలయందున్నది. నెల రెండు నెలలలో వెలువడఁగలదు. ఈ నాటకమును మఱి యితరములును నిదివఱకుఁ బ్రచురింపఁబడకుండుటకుఁ గారణము లనేకములు. కార్యాంతర ప్రవిష్టుఁడనై నందున నాపని

15. ఇంచుమించుగా పదిమందివరకు నలచరిత్రను నాటకీకరించినారు. మంత్రిప్రెగడ భుజంగరావుగారి నలనాటకము 1894 లోనే ముద్రితమైనది. సారంగధర చరిత్రను ఇంచుమించుగా 20 మంది నాటకీకరించినారు. పానుగంటి నరసింహారావు, కాళ్ళకూరి నారాయణరావు, విష్ణుభొట్ల సుబ్రహ్మణ్యేశ్వరుడు ప్రభృతుల సారంగధరులు ఆచార్యులవారి విషాదసారంగధరకంటె ముందే ముద్రితాలైనవి. ఇల్లే ఇతరనాటకాలవిషయంలోనూ జరిగింది.

నాకితరకార్యముల కెడమియ్యదయ్యె. ఎప్పుడైన నవకాశము కలిగెనా సరసవినోదినీసభకై క్రొత్త క్రొత్త నాటకములు రచియించుచువచ్చితిఁ గాని రచియించినవాని నవ్వరించి ప్రచురింపఁ జాలనైతి. ఇప్పటికిని నీనాటకము ప్రచురితమైయుండదు. నామిత్రులుపెక్కండ్రు నా నాటకము లెట్లైనఁ బ్రచురింపుమని మీఱరాని నిక్కచ్చి యొనర్చిరి. తొలుదొల్త నీనాటకములు గేయభూయిష్ఠములై యుండుట వానినట్లే ప్రచురింప సాధ్యములేదని యెంతనేఁ జెప్పినను విననైరి. నా శ్రేయోభివృద్ధిగోరు నొకమిత్రుఁడు నాయొద్దనున్న హస్తాక్షరప్రతినుండి వ్రాసికొని మొదటిసంచిక (Form) యచ్చొత్తించి నాకుఁ బంపెను. ఆయుద్యమము గాదనఁజాలక ప్రచురించియున్నాఁడ." 16

విషాదసారంగధర పీఠికలో పేర్కొన్న మిత్రులు వి. వి. సుబ్బయ్యశెట్టిగారు. ఆచార్యులవారు మద్రాసు వచ్చినప్పుడు జార్జిటవున్‌లో వీరి ఇంటిలోనే మకాముచేసేవారట. కొందరు ఆచార్యులవారి నాటకాన్నే 'చిత్రనళీయము డ్రామా' అనే పేరుతో తప్పులతడకగా ముద్రించి అమ్ముకొనుచుండగా ఆచార్యులవారు వారిపై అభియోగముతెచ్చి, అపరాధపరిహారము పొందినారు. మొత్తంమీద ఆచార్యులవారి జీవితకాలంలో చిత్రనళీయ - విషాద సారంగధరాలు రెండు మాత్రమే ముద్రితాలైనవి. ఇంక తక్కిన ముద్రిత నాటకాలన్నీ వారి మరణానంతరం వారి సోదరులు, కుమారులు ముద్రించినవే.

ఆచార్యులవారి ఫొటోతోకూడిన ఒక ప్రకటన పత్రికలో వారి రచనలుగా 29 నాటకాలు పేర్కొనబడినవి - అందులో 14 'అచ్చుపడినవి'; తక్కినవి 'అచ్చుపడనివి'.

---

16. విషాదసారంగధర ప్రథమ ముద్రణ పీఠిక - తేదీలేదు.

అచ్చుపడినవి :

| | | |
|---|---|---|
| 1. | చిత్రనళీయము | రు 1-4-0 |
| 2. | విషాదసారంగధరము | 1-4-0 |
| 3. | పాదుకాపట్టాభిషేకము | 1-4-0 |
| 4. | ప్రహ్లాద నాటకము | 1-0-0 |
| 5. | సావిత్రీ చిత్రాశ్వము | 1-0-0 |
| 6. | మోహినీ రుక్మాంగదము | 1-0-0 |
| 7. | బృహన్నల నాటకము | 1-0-0 |
| 8. | ప్రమీలార్జునీయము | 1-0-0 |
| 9. | పాంచాలీ స్వయంవరము | 1-0-0 |
| 10. | ముక్తావళీ నాటకము | 1-0-0 |
| 11. | చిరకారి నాటకము | 1-0-0 |
| 12. | చంద్రహాస నాటకము | 1-0-0 |
| 13. | రోషనారా శివాజి | 1-0-0 |
| 14. | వరూధినీ నాటకము | 1-0-0 |

అచ్చు పడనివి :

15. ఉషాపరిణయము
16. సుశీలా జయపాలీయ నాటకము
17. అజామిళ (వచన నాటకము)
18. యుధిష్ఠిర యౌవ రాజ్యనాటకము
19. సీతా స్వయంవర నాటకము
20 ఘోషయాత్ర
21. మదనవిలాస నాటకము
22. ఉన్మాదరామప్రేక్షణిక నాటకము
23. ఉదసా కల్యాణము

24. రాజ్యాభిషేకము
25. సుగ్రీవపట్టాభిషేకము
26. విభీషణ పట్టాభిషేకము
27. హరిశ్చంద్ర నాటకము

కన్నడ నాటకములు

28. ఉపేంద్ర విజయము లేక వామన చరిత్ర
29. స్వప్నానిరుద్ధ నాటకము

అచ్చుపడనివాటిలో వామన చరిత్రము (లేదా ఉపేంద్ర విజయము), స్వప్నానిరుద్ధము అనే రెండు కన్నడ నాటకాలు, మదన విలాస, ఉన్మాదరామ ప్రేక్షణికాలు రెండూ 1879 లో రచింపబడిన చిన్ననాటకాలు. ఇవి 1879 లోనే ప్రదర్శింపబడినవి. రాజ్యాభిషేకము ఒక ప్రత్యేక సందర్భముకొరకు రచింపబడి, ఒక్కసారి మాత్రమే ప్రదర్శింపబడినట్లు కన్పట్టుచున్నది. ఇంక ఉదసాకల్యాణమనేది ఒక ప్రత్యేక నాటకం కాదనీ, మూడు నాటకాలలోని కల్యాణ ఘట్టాల కూర్పు అనీ గుర్తించినాము. అచ్చుపడని నాటకాలలో ఇంక మిగిలినవితొమ్మిది. వీటిలోనాకులభించినవి 5 మాత్రమే. కాగా అచ్చుపడని తెలుగు నాటకాలలో పది నాటకాల ప్రతులు లేనట్లే.

# ముద్రితనాటకాలు

ఆచార్యులవారి ముద్రితనాటకాల రచనాక్రమం సరిగా తెలియరావటం లేదు. అందుచేత వారి నాటకరచనాపరిణామాన్ని నిర్దిష్టంగా అనుసంధించటం కష్టసాధ్యము. అయినా ఆచార్య ఖండవల్లి లక్ష్మి రంజనంగారు ఊహచేసి ఒక క్రమాన్ని సూచించినారు—

"వీరు తమ తొలుతటి నాటకములందు గీర్వాణరూపక సంప్రదాయము ప్రకారము నాందీ ప్రస్తావనాది నియమములను పట్టుదలతో పాటించినట్లూహింపవచ్చును. రెండవదశ నాటకములందు ప్రస్తావనా భాగము శోషిల్లి, నాందీపద్యమొక్కటమాత్రమే నిల్చుట గానవగును. తమ చరమ రచనలందు వీరు నాందీపద్యమునుగూడ విడచి కథారంభముతోనే నాటకమారంభించుట చూపట్టును. ఈ సూత్రము పరిగ్రహణయోగ్యమైనచో ఈ క్రింది రచనాక్రమమును గుర్తింపవచ్చును. ముద్రితములలో సుదీర్ఘ ప్రస్తావనగల నాటకములు — చిత్రనళీయము, సావిత్రీచిత్రాశ్వము, సారంగధర, పాదుకా పట్టాభిషేకము. అల్ప ప్రస్తావనగల నాటకములు - ప్రమీలార్జునీయము, బృహన్నల, ముక్తావళి నాటకములు. ప్రస్తావనా రహితములు — పాంచాలీ స్వయంవరము, చిరకారి, ప్రహ్లాద, చంద్రహాస, వరూధిని,

మోహినీ రుక్మాంగద " (పరిశోధన - డిశంబరు - జనవరి 1955 - పుట 17).

ఇక్కడ ఒక విషయాన్ని గుర్తుచేయవలసి ఉన్నది. చిత్రనళీయ, సారంగధర నాటకాలను ఆచార్యులవారే ప్రకటించినారు. "సావిత్రీ చిత్రాశ్వ, పాదుకా పట్టాభిషేక నాటకాలను ముద్రించుటకు యత్నించుచున్నా "నని వారే చెప్పినారు. అందుచేత ఈ నాలుగింటికి మాత్రమే ఆచార్యులవారు సవరణ లేదా ముద్రణ ప్రతులను (Press Copies) సిద్ధముచేసినారన్నమాట. కావుననే వీటిలో ప్రస్తావనాదులు యథావిధిగా ఉన్నవి. తక్కినవాటిలో అట్లా లేకపోవటానికి కారణం ఆచార్యులవారు వాటిని ప్రత్యేకించి సిద్ధముచేయకపోవటమే అని చెప్పవచ్చునేమో.

ఇప్పుడింక ఈ పదునాలుగు నాటకాలనుగూర్చి తెలిసినంత వరకు కాలానుపూర్విగా, సంక్షిప్తంగా వివరిస్తాను.

1. చిత్రనళీయము : ఇది ఆచార్యులవారి తొలి ప్రౌఢ నాటకము. రచన 1887; ప్రథమ ముద్రణము 1894 లో. ఆచార్యులవారి నాటకాలలో ముద్రణభాగ్యమును పొందిన తొలి నాటకమిదే. 5 అంకాలు; 32 రంగాలు. నాందీ - ప్రస్తావనలు సలక్షణంగా ఉన్నవి. ఉత్తరరంగంకూడా ఉన్నది. భారతారణ్య పర్వమందలి నలోపాఖ్యానమే ఈ నాటకమునకు మూలము. పూర్వభాగమున శృంగార నైషధానుసరణము కొంత కన్పట్టగలదు; కాని ప్రదర్శన కనుకూలముగామి, హంసదౌత్యమును విడిచిపెట్టినారు. ఇంక ఉత్తరభాగమున భారతానుసరణమే అధికము. మొత్తం మీద ఇందులో ఆచార్యులవారు చేసిన కల్పనలు అత్యల్పము; మూలంలో సూచనమాత్రంగా ఉన్నసన్నివేశాలను బాగా, ప్రదర్శన యోగ్యంగా విపులీకరించినారు.

2. సావిత్రీ చిత్రాశ్వము : ఇది తమ రెండవ నాటకమని ఆచార్యులవారే పేర్కొనిరి. దీనిని నవరసభరితముగా రచించినట్లు ఆచార్యులవారు ప్రస్తావనలో తెల్పినారు వారి జీవితకాలంలోనే మొదటి రెండంకాలు ముద్రితములైనవి. తక్కిన అంకములందు ఆచార్యులవారు పద్యములను రచింపనేలేదట. అందుచేత, వారి సోదరులు - శ్రీ శేషాచార్యులుగారు - ఆ భాగాలను పూరించి, 1914 లో సంపూర్ణంగా ముద్రించినారు.

3. చిరకారి : చిరకారి నాటకప్రదర్శనాన్ని మద్రాసులో 1891 జూన్ నెలలోనే చూచినట్లు శ్రీ సంబందం మొదలియార్ తెలిపి ఉండటంచేత ఇది ఆచార్యులవారి తొలి రచనలలోనిదే కాద గును. ఇది 17-1-1891 తేదీన బళ్ళారిలో ప్రప్రథమంగా ప్రదర్శింపబడి నది. (1919 లో ప్రథమ ముద్రణము). భారతమునందలి శాంతిపర్వం లోని చిన్నికథను గ్రహించి, పెంచి, మార్పులు కావించి, ఆచార్యుల వారు ఈ నాటకాన్ని రచించినారు. ఇందు నాందీ ప్రస్తావనలు లేవు.

4. బృహన్నల : "క్రొత్త విధముగా సవరింపబడిన" (recast) ఈ నాటకము 21-3-1896 తేదీన బళ్ళారిలో ప్రదర్శింప బడినది. అందుచేత మొదటిప్రతి అంతకుముందే రచింపబడినదికావలె. ప్రథమ ముద్రణము 1917 ప్రాంతాల. ఇందులో ప్రస్తావనలేదు.

5. వరూథిని : దీని వ్రాతప్రతిమీద ఆచార్యులవారి సంతకము, 24-6-1896 అనే తేదీ ఉన్నాయి. కాగా అంతకుముందే ఇది రచింపబడి ఉండవలె. ఇది 18-7-1903 తేదీన మద్రాసు సుగుణ విలాససభలో ప్రదర్శింపబడినది. ఇందులో మూడు అంకాలు గలవు. మనుచరిత్రలోని పద్యాలిందులో యథాతథంగా గ్రహింప

బడినవి. 1917 లో ప్రథమ ముద్రణము. ఇందులో నాంది ప్రస్తావనలు లేవు.

6. విషాదసారంగధరము : ఇది తమ ఆరవ నాటకమని, ప్రప్రథమంగా బళ్ళారిలో 1889 లో ప్రదర్శింపబడినదని ఆచార్యులవారే చెప్పినారు. (సారంగధర ప్రథమ ముద్రణ పీఠిక). ఇది తెలుగులోని తొలి విషాదరూపకమని చెప్పవచ్చు. విషాదరూపక ప్రయోజనాన్నిగూర్చి ఆచార్యులవారు పీఠికలో చర్చించినారు. ఇది 1908-12 మధ్యకాలంలో ముద్రింపబడి ఉంటుంది.

7. పాదుకాపట్టాభిషేకము : దీని రచన ఎప్పుడో తెలియరాలేదు. ఇందలి ప్రస్తావనలోమాత్రమే 'ఆంధ్రనాటక పితామహ' బిరుదము పేర్కొనబడినది. కావున ఇది 1905 తరువాతి రచన అయి ఉండవచ్చును. 1908 కి పూర్వమే రచింపబడినదనటం నిశ్చయము. రామాయణకథావిషయమున గలుగు సహజ సందేహాల కిందులో ప్రత్యుత్తరములు గలవని ప్రస్తావనలో ఆచార్యులవారు పేర్కొన్నారు.

8. ప్రమీలార్జునీయము : ఇందలి కథ జైమినిభారతంనుంచి గ్రహింపబడినది. 26-12-1905 తేదీన మద్రాసు సుగుణవిలాస సభలో ప్రదర్శితము. రచన అంతకుముందెప్పుడు జరిగినదో తెలియదు. 1925 లో ప్రథమ ముద్రణము. అంకములైదున్నవి. అనుబంధమున 52 పాటలు కలవు. ప్రస్తావన లేదు. ఇందులో అతిరథులు, మహారథులు అయిన వీరులందరు స్త్రీల సౌందర్యానికి భ్రమించి హాస్యభాజనులగుట నిరూపితమైనది. 'స్త్రీవిద్య' మంచిదని ఉత్తరరంగమున ప్రబోధముకలదు.

9. ప్రహ్లాద నాటకము: రచన ఎప్పుడో తెలియదు. నాందీ, ప్రస్తావనా, ఉత్తరరంగములు మూడూ లేవు. అనుబంధ మున 40 పాటలు కలవు. పద్యాలను పోతన్నగారి భాగవతంనుంచి గ్రహించి, యథాతథంగా వాడుకొన్నారు ఆచార్యులవారు.

10. ముక్తావళి: 1915 లో ప్రథమ ముద్రణము. ప్రస్తావనా, ఉత్తర రంగములు లేవు. అనుబంధమున 42 పాటలు కలవు. ఇది తొలుత దుఃఖాంతంగా రచింపబడినది. కాని తరవాత మోదాంతంగా మార్చి, అల్లే ముద్రించినారు. అనుబంధమున 42 పాటలు కలవు. నాయికయగు 'ముక్తావళి' ని బట్టి దీనికి పేరు వచ్చినది. ఈమె భూపాలరాజునకు ద్వితీయభార్య కావటంతో కథ ముగిసింది. ఈమె మరణించినప్పటికీ 'జీవారి' రసప్రభావంతో మరల బ్రతకటం చేత కథ మోదాంతమైనది.

11. అభిజ్ఞానమణిమంతనాటకము (లేదా చంద్రహాస నాటకము): ఇది మొదట దుఃఖాంతము; తరువాత మోదాంతముగా మార్చి 1916లో అల్లే ముద్రించినారు. కాని, తరువాత రెండవ ముద్రణంలో యథాతథంగా దుఃఖాంతంగానే ఉంచినారు. దీనినిగూర్చి 15-8-1916 తేదీనాటి ఆంధ్రపత్రికలో ఇట్లున్నది — "ఆచార్యులుగారు శ్రమచేసి ప్రతి రంగమును గూడ మనోహరముగ నుండునట్లు రచించిరి ... మూడవ అంకము మొదలు కడవరకును కూడ చాల మనోహరముగ నుండును. దీనిని దుఃఖాంత నాటకముగ రచించి మదన కుంభీనసుల నిరువురినిగాని, లేక కుంభీనసు నొక్కనినైనగాని గతప్రాణునిగా నొనరించిన దీని నీతిని ప్రేక్షకులు మఱింత స్ఫుటముగ గ్రహింపఁగలుగుదురని తోఁచుచున్నది, గాని

మనవారట్టి ప్రదర్శనములను జూచి సహింపజాలరనిగాబోలు ఆచార్యులవారు దీనిని కల్యాణాంతముగ నొనర్చియున్నారు. ఇదివరకాంగ్ల భాషలో నొకరీ నాటకమును వ్రాసియున్నను ఆచార్యులవారు దాని నాధారముగ గొనక స్వకపోలకల్పనలనే యొనరించుట కడుంగడు ప్రశంసనీయము." ఇందులో నాందీప్రస్తావనలు లేవు.

12. పాంచాలీ స్వయంవరము : 1918లో మొదటికూర్పు. ఇందులో 'దశరూపుడు' అను పాత్ర నవీనముగా కల్పింపబడినది. అతనివలననే పాండవులలో ఒక్కడైనను లాక్షాగృహదహనకాలములో తప్పించుకోగలడనే ఆశ అందరకును జనించినది. ద్రౌపదికి ఒకరు మించిన భర్తలగుదురని సోదెకత్తెచేత ఒక చిత్రమగు సంభాషణలో సూచింపజేసినారు. బకాసురునకు బలిగా బ్రాహ్మణ కుటుంబంలో ఒకరు పోవలసి ఉన్న ఘట్టంలో 'యువతీ వివాహము'ను గూర్చిన చర్చ కలదు. బాల్యవివాహము కూడదని ఆచార్యులవారి మతము. ఇందు నాందీ ప్రస్తావనలు లేవు.

13. మోహినీరుక్మాంగద : మల్లనామాత్యకృతమగు 'రుక్మాంగద చరిత్రము' లోని మనోహర పద్యాలిందు సంగృహీతములైనని; కాని కథాసంవిధానములందు ఇది దానితో భేదించుచున్నది. 1920లో మొదటి కూర్పు. ఇందు నాందీ ప్రస్తావనలులేవు.

14. రోషనారాశివాజి : రచన ఎప్పుడో తెలియదు. 1922 ప్రాంతాల మొదటి కూర్పు. అనుబంధమున 28 పాటలు కలవు. రోషనారా ఒక మహారాష్ట్రి దంపతుల బిడ్డ. ఆమె తల్లిని మోహించిన ఔరంగజేబు, ఆమెను పొందజాలక, అహల్యా

బాయి అనే వారి బిడ్డను దొంగతనంగా ఎత్తుకొనిపోయి, 'రోష నారా' అనే పేరుపెట్టి పెంచుకొనుచుండెను. ఆమె ఔరంగజేబు పుత్రిక అనియే అందరి అభిప్రాయము. ఇది పూర్వకథ. రోష నారా శివాజీలు వివాహమాడినతరువాత యథార్థ మెరిగి మరింత సంతోషించినారు. అల్లే, హాసనల్లీ ఖానుడు వారి కుమారుడైన త్ర్యంబకుడే అని నాటకాంతంలో తెలిసింది. ఇందు నాంది, ప్రస్తావన, ఉత్తరరంగాలు మూడూ లేవు.

# అముద్రితనాటకాలు

అముద్రిత నాటకాలు తొమ్మిదింటిలోను నాకు లభించినవి ఐదు నాటకాలు మాత్రమే. వీటి వ్రాతప్రతులు ఆచార్యులవారి కుమారులు రంగాచార్యులుగారివద్ద ఉన్నవి—

1. అజామిళ ; 2. హరిశ్చంద్రనాటకము ; 3. సుగ్రీవ పట్టాభిషేకము ; 4. యుధిష్ఠిరయౌవరాజ్యము ; 5. ఉషా పరిణయము.

1. **అజామిళ :**

ఆచార్యులవారి వచన నాటకంగా ప్రసిద్ధి పొందిన రచన ఇది. ఆచార్యులవారి నాటకరచనా విధానాన్ని ఇంతకుముందే విశదపరచి నాను. వారెల్లప్పుడు ఏనాటకం అయినా తొలుత కేవలం వచనం గానే కాగితానికి ఒకపక్కనే వ్రాసేవారు. తరవాత ఎదుటిపేజీలో ఎర్రసిరాతో సందర్భోచితంగా పద్యాలను, పాటలనువ్రాసి, చేర్చే వారు. ఇట్లా వ్రాయటంలో ఆయా భూమికలకు ఎన్నికైన నటుల సామర్థ్యం వారి దృష్టిలో ఉండేది. కావుననే వచనంలో చెప్పిన భావమే పద్యంలోను, అదే పాటలోనూ ఉంటుంది. నాటకం మామూలుగా చదివేవారికి ఇది వింతగా తోచవచ్చు. కాని, నటులు

మాత్రం సంగీతంవచ్చినవారైతే పద్యాన్నో పాటనో పాడి వచనం మానివేసేవారు; సంగీతం రానివారైతే వచనంతోనే తృప్తి పడేవారు.

ఆచార్యులవారు అజామిళనుకూడా పైవిధంగానే తొలుత కేవల వచనంగానే వ్రాసినారు. కాని, తరవాత పాటలను, పద్యాలను చేర్చే ప్రయత్నం చేయలేదు; అవి లేకుండానే విజయవంతంగా ప్రదర్శనా లిచ్చినారటకూడాను.

అజామిళుని కథ భాగవతంలోనిది. ఆచార్యులవారు కథనే కాక, ముఖ్యంగా అజామిళ భూమికను కూడా పూర్తిగా మార్చి వేసినారు. ఈ నాటకంలో ఐదు అంకాలున్నాయి.

వివాహం కాకుండానే రజస్వల అయి, సంఘంచేత వెలివేయ బడిన పద్మావతి అనే కన్యను ఆమె ఆత్మహత్య చేసుకొనబోవు సమయంలో రక్షించి, పండితుడైన అజామిళుడు వివాహం చేసుకొనటం ప్రథమాంకమందలి కథ. (కాని, మాటలలో ధర్మరక్షకంటె సౌందర్యోపాసన ప్రాబల్యం వహించినట్లుగా గోచరిస్తున్నది).

అజామిళ - పద్మావతులపైన పగబట్టిన హీరాంబా - కేశవావధానులు, తదితరులు అజామిళునిపై ఒక దోపిడీ వ్యవహారాన్ని సృష్టించినారు. న్యాయస్థానంలో విచారణ జరిగినపిమ్మట అజామిళునకు 5 ఏళ్ళ శిక్ష విధింపబడింది — ఇది రెండవ అంకంలోని కథ.

అసలు దొంగలు పద్మావతిని శూరశర్మ అనేవాని బారినుంచి తప్పించి, ఆమె అంగీకారంతో, అజామిళుడు తిరిగివచ్చేవరకు ఆమె సంరక్షణ భారాన్ని వహించినారు. అజామిళుడు తిరిగివచ్చినతరవాత విధిలేక దొంగలతోకలిసినాడు. ఇంతలో అరక్షకాధ్యక్షుడు (S. I.) ఒక కుట్రపన్ని, మరల అజామిళుని బంధించి తీసుకొని పోయినాడు.

అతడు బంధితుడైనందులకు వాని శత్రువులంతా ఆనందించినారు. వారి భార్యలు పాచికల ఆటలో తగవులు పడి, ఒకరిదోషాల నింకొకరు దెప్పిపొడుచుకొంటూ, చివరికి సమాధానపడి, ఆలింగనాలు చేసుకొని, ముద్దులు పెట్టుకుని విడిపోయినారు — ఇది మూడవ అంకమందలి కథ.

దొంగలనాయకుడు అజామిళుని విడిపించి తీసుకొని వెళ్ళినాడు. హీరాంబాదులు శూరశర్మతో కాశీయాత్రకు బయలుదేరినారు. దారిలో దొంగలు వారిని చావగొట్టి, అజామిళుని ఎదుట నిలబెట్టినారు. అచ్చటవారి పూర్వ దుశ్చర్యలు బయట పడగా కేశవావధాని, శూరశర్మలు పశ్చాత్తాపపడినారు. పద్మావతి కలుగజేసుకొని వారినందరిని విడిపించును. ఇది నాలుగవ అంకము.

ఒక గ్రామకరణము 'ఆఖుమారి' అనే వ్యాధిని గూర్చి ప్రభుత్వపు హెచ్చరికను ప్రకటించును. తమ ముగ్గురు పుత్రులు ఆఖుమారికి హతులుకాగా పద్మావతీ - అజామిళులు దుఃఖించుచున్న సమయంలో శూరశర్మాదులు సేనతో వచ్చుచున్నారనే వార్త వచ్చును. తమ్ము బంధించి తీసుకొనిపోవుటకే వీరు వచ్చుచున్నారని అనుమానపడిన అజామిళునకు, పక్కనేఉన్న పద్మావతికి ఆఖుమారి తగిలి ఇరువురూ విగతజీవులైనారు. నిజానికి వారిని సగౌరవంగా రాజ్యంలోకి కొనిపోవలెనని వచ్చిన శూరశర్మాదులకు దుఃఖమే మిగిలింది. పుత్రమరణదుఃఖంతో ఏకాదశినాడుపవసించి, చనిపోతూ చివరి పుత్రుడగు 'నారాయణు' ని స్మరించటంచేత అజామిళునకు పుణ్యలోకప్రాప్తి కలిగినది. విష్ణుదూతలువచ్చి, యమభటుల నడ్డగించినారు. యముడేవచ్చి విష్ణుభటులతో తలపడినాడు. (ఇచ్చట సంవాదంలో భాగవతంలోని పద్యాలే వెనుకముందులుగా స్వీకృతములైనవి.) విష్ణువు వచ్చి యముని మందలించెను. పద్మావతీ — అజామిళులు పరమపదమున కేగినారు. శూరశర్మాదులు గుడి

కట్టుటకు నిశ్చయించుకొని దుఃఖంతో తిరిగిపోయినారు. ఇది ఐదవ అంకమందలి కథ.

ఆచార్యులవారినాటక కథాగతి 'రజస్వలా వివాహ' మనే సమస్యపై ఆధారపడునట్లు చేసినారు. ఇది అమూలకము. దీనికి ఆడువారి అసూయలు, రంకులు, సమావేశాలు తోడ్పడునట్లు చేసినారు. అజామిళుడు సురాపానము వలదని దొంగలకు బోధించును. ఇది అంతా ఆధునిక వాతావరణానికి సంబంధించినది; మరి పౌరాణిక వాతావరణానికి కొంత ఎబ్బెట్టుగానే ఉన్నది. 2 వ అంకంలోని 2 వ రంగము న్యాయస్థానము. ఇది సరిగా విషాధసారంగధరలోని న్యాయస్థాన రంగమువలెనే ఉన్నది. ఉద్దండ - సదయులను వారిలో సదయుడు అజామిళుని పక్షము; ఇతడు ఓడ ప్రయాణంచేసి వెలికి గురి అయినవాడట. విషాదసారంగధరమునందువలెనే ఇచ్చటను అన్యాయపక్షమే గెలిచినది. దీనినిబట్టి న్యాయస్థానాలలో తెలియకుండా జరిగే అన్యాయాలను ఎత్తిమాపటమే ఆచార్యులవారి ఆశయంగా కనబడుతున్నది; అంతేకాని తాము న్యాయవాదులగుటచేత, ఆవృత్తిలో తమ ప్రతిభను వ్యక్తంచేసుకొనుటకు కల్పించినవి కావీరంగాలు.

నాయక మరణంతో అంతమయిన ఈ నాటకము 'విషాద నాటకము' అగుచున్నది. సంఘమున కెదురీదుట, విధిలేక దొంగల గుంపులో చేరుట అనేవి అజామిళుని లోని దోషాలు లేదా లోపాలు. అందులకే ఆతడు బలి అయినాడు. అందులకు తగినపద్ధతిలో నాటకము బాగుగానే నడచినది. ఇంక చివర రంగంలో ఏకాదశి ఉపవాసంచేతా, 'నారాయణ' పద స్మరణచేతా ఆతడు ముక్తుడైనట్లు చెప్పబడటం కేవలం పౌరాణిక వాతావరణానికి చెందినది (అసలు భాగవతమందలి అజామిళుడు పరమ దుర్మార్గుడు); ఇది నాటకానికి

అతకలేదు. వారి మరణంతోను, శూరశర్మాదులు దుఃఖించటం తోను నాటకమంతమైఉంటే కథకు జిగి చేకూరి ఉండేది.

ఇందులో పాత్రోచితభాష పాటింపబడటం ఒక విశేషము.

2. హరిశ్చంద్ర నాటకము :

దీనికి 'ప్రచండ గాధేయము' అనే నామాంతరం ఉన్నది. 5 అంకాలు, 19 రంగాలు ఉన్న ఈ నాటకాన్ని ఆచార్యులవారు 1910 సంవత్సరం మే నెలలో సికిందరాబాదులో వ్రాసినట్లు తెలిపినాను. అంతకు ముందే కోలాచలం శ్రీనివాసరావుగారు హరిశ్చంద్ర నాటకం వ్రాయడంచేత దానినే తాను మరల వ్రాయటానికి తొలుత ఆచార్యులవారు తలపెట్టలేదు. కాని, చివరకు మిత్రుల ప్రోత్సాహంతో పై విధంగా రచించటం జరిగింది. ఇందు మొత్తం మీద పద్యాలు, అందున వృత్తాలు చాలాతక్కువ; పాటలు పదికంటె ఎక్కువ ఉండవు. వ్రాత ప్రతిలో మొదటి రెండంకాలలోను రంగాల మార్పు కొంత సూచింపబడినది. ఇందలి పద్యాలకు ఒక

ఉదాహరణము :

వశి-ఉ॥ నీవును నిన్నుబోలెడి మునిప్రవరుల్పదివేలుగూడి మా
యౌవనరాశిముంచి హృదయంబు గలంచి మహోగ్రదుఃఖసం
భావితుఁగాగఁజేసినను భావములో నణుమాత్రమైన యా
భూవరవంశవర్ధనుడు బొంకడు మాటలు వేయునేటికిన్.

ఇందలి కథలో చెప్పుకోదగిన క్రొత్తమార్పుల నేమీ ఆచార్యులవారు ప్రవేశపెట్టలేదు.

3. సుగ్రీవ పట్టాభిషేకము :

దీని రచన ఎప్పుడో తెలియదు. సీతారామలక్ష్మణులు అత్రేయాశ్రమంలో ఉండగా కథ ఆరంభమై వాలి వధతో ముగిసినది.

మూడవ అంకంలో రావణుడు సీతనెత్తుకొనిపోవుచుండగా వాలి అడ్డువచ్చి, అట్టిపని వలదనును. "శూర్పణఖ ముక్కు చెవులు కోయటంచేత నేను ప్రత్యపకారానికి పూనుకొంటినేకాని వేరుకా" దని రావణుడు సమాధానం చెప్పును. "అబల నట్లు చేయటంతప్పే" అంటూ రావణుడు సీతను కొనిపోటానికి వాలి అంగీకరించినాడు.

వాలి:- "... మీ మీ కలహాములతో నాకేల? రావణా! కొనిపొమ్ము తరుణిని. దుడుకుతనము మాత్రమొనర్పనని మాట యిమ్ము. రాముడు నాయెడ కేతెంచి తానొనర్చిన క్రూర కార్యమునకు సమాధానమొసంగెనా నేను నీయొద్ద కేతెంచెదను. అప్పుడు నీవే యీతన్విని గొనివచ్చి అతని కప్పగింపవలసివచ్చెడు. ఈలో నీవేమైన దుష్కార్య మొనరించియుంటివా నీలంక నంతయు సముద్రమున పెకలించివైచెద."

"శూర్పణఖ రాక్షసి. అది నన్ను మ్రింగబోయె" నని సీత చెప్పగా "ఉండుగాక. పిదప విచారింతము. నీకేమియు బాధకలుగకుండ నేనుత్తరవాదిని" అని వాలి సమాధానము చెప్పును. ఈ పైకల్పన కొత్తది; ఆచార్యులవారి స్వీయము. 4, 5 అంకములలో వాలి - రాముల మధ్య సుదీర్ఘములైన ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగినవి.

ఈ నాటకమందు పాటలెక్కువ, పద్యాలు తక్కువ. కొన్ని చోట్ల సంభాషణలు బాగుండలేదు — ప్రథమాంకమందు దండకారణ్యవాసులువచ్చి ఖరదూషణాదుల బారినుంచి రక్షణకోరగా రాముడంగీకరించెను. అప్పుడు సీత "నాథా! మఱియేదో బెడదవచ్చునట్లున్నది. నిష్కారణముగా నీవేల ప్రాణి సంహారమున కుద్యమింపవలె?" అని ప్రశ్నించును. అంతట రాముడు "మాట యిచ్చి మానుదునా? భీరుడనగుదునా?" అనును. అప్పుడు వారిరువు

రకును సంవాదము జరుగును; డై లాగు పాటకూడ కలదు. ఇది ఉచితంగాలేదు.

4. యుధిష్ఠిర యౌవరాజ్యము :

దీని రచన జూలై 1905 ప్రారంభించబడి, 31-10-1905 తేదీన ముగిసినట్లు వ్రాతప్రతిమీద గలదు. ద్రోణుడు ద్రుపదునిచేత అవమానితుడై, కౌరవపాండవులకు విద్యగరపి, అర్జునునిచేత ద్రుపదునిపట్టి తెప్పించినాడు. ఇప్పటికి మూడు అంకములైనవి నాల్గవ అంకంలో ద్రౌపది పాండవులందరును వచ్చిరనిచెప్పటం, ధృతరాష్ట్రుడు ధర్మజునకు యౌవరాజ్యపట్టాభిషేకము చేయ నిశ్చయించటం వ్యక్తములైనవి. 5 వ అంకంలో యుధిష్ఠురుని యౌవరాజ్య పట్టాభిషేకము; దుర్యోధనాదుల అసూయ ప్రదర్శితములైనవి.

మొదటి అంకము 3 వ రంగంలో పరశురామునివద్ద మారు వేషంతో కర్ణుని విద్యాభ్యాసము; రెండవ అంకం మొదటిరంగంలో ఏకలవ్యుడు గురుదక్షిణ ఇవ్వటం అనే ఘట్టాలుకూడా ప్రదర్శితములైనవి. ''విద్యాధికతలేని యెఱుకువాడవగుటచే దుస్సాంగత్యమున విద్యను చెడ్డగా ఉపయోగింతువను భయముతో నిన్ను వ్యర్థుని చేయదలంచినాను'' అని ద్రోణుడు ఏకలవ్యునితో చెప్పుట కుంటి సాకుగా ఉన్నది

''హిడింబా భీమసేనీయ'' మనెడి ఇంకొక వ్రాతప్రతి రంగాచార్యులుగారివద్ద ఉన్నది. పట్టాభిషేకమైనపిమ్మట, పై నాటకమునకు, లాక్షా గృహదహనము, హిడింబాసుర వధ, హిడింబా భీముల సమాగమము అనే ఘట్టాలనుకూడా కలపటంచేత హిడింబాభీమసేనీయము తయారైనది. ఈ మార్పు ఎప్పుడుచేయబడినదో తెలియదు. ఈ హిడింబా భీమసేనీయము తరువాతికథయే పాంచాలీ స్వయంవరము; ఇది ముద్రితము.

5. ఉషాపరిణయము :

దీనికి 'స్వప్నానిరుద్ధ' మనే మారు పేరు కలదు ; ఆచార్యుల వారు ఆదిలో స్వప్నానిరుద్ధమనే కన్నడనాటకం వ్రాసిఉండటం గుర్తించి ఉన్నాము. దానికిది అనువాదమో, లేదా స్వతంత్ర రచనో తెలియదు. ప్రస్తావన సంస్కృతంలో ఉన్నది. లభించిన వ్రాత ప్రతిలో 4 వ అంకము 3 వ రంగంలో సగమువరకే ఉన్నది. సందర్భాన్ని పట్టి, ఆచార్యులవారి అలవాటునుబట్టి 5 వ అంకము కూడా ఉండిఉండవలె. భక్తవశంవదుడై బాణపురమున నిలిచియున్న పార్వతీపతిని కైలాసానికి తిరిగిరమ్మని ఋషులందరూ కోరటంతో నాటకము అరంభమైనది. కూచిపూడివారి సంభాషణల పోకడలు కొన్ని ఇందు కన్పట్టగలవు.

6. వామనచరిత్రము (లేదా ఉపేంద్రవిజయము) :

ఆచార్యులవారి ఈ కన్నడ నాటకాన్ని కప్పగల్లు సంజీవ మూర్తి రావుగారు 1920 లో అనువదించినారు ; ఇది అముద్రితము. ఇందులో 5 అంకాలున్నవి. కొన్ని చాల చిన్నరంగాలు ; మరికొన్ని చాలా పెద్దరంగాలు ; సంభాషణలుకూడా చాలా దీర్ఘంగా ఉన్నవి. సంజీవమూర్తిరావుగారి అనువాదము సరళంగా నడచినది.

ఇంక తక్కిన నాటకాలు నాలుగు – 1. సుశీలా జయపాలీయము ; 2. సీతా స్వయంవరము ; 3. ఘోషయాత్ర ; 4. విభీషణ పట్టాభిషేకము-నాకు లభించలేదు.

## విషాద సారంగధరము

సారంగధర చరిత్రను తెలిపే గ్రంథాలలో, ఇప్పటికి లభించిన వాటిలో, 'నవనాథచరిత్రము' మొదటిది; ఈ ద్విపదకావ్యమును గౌరన 15 వ శతాబ్ది పూర్వార్ధంలో రచించినాడు. తన రచనకు గిరిరాజకవి పద్య ప్రబంధము మూలమని అతడు చెప్పుకొనెను గాని అది అలభ్యము. గౌరన గ్రంథాన్నిబట్టి సారంగధరకథ మాళవదేశ మండలి మాంధాతపురమున జరిగినది; సారంగధరుని తండ్రి 'రాజ మహేంద్రుడు'. ఈ కథకు తెలుగుదేశంతో ఎట్టి సంబంధమూలేదు- మహారాష్ట్రి భాషలోని 'కృష్ణా గరుడిచరిత్రము', కన్నడభాషలోని 'కుమారరాముని కథ' సారంగధర చరిత్రలోని కథాంశాలతో సంవదించటం గమనార్హము. క్రీ. శ. 1547 లో 'బాలభాగవత'[17] మనే ద్విపదకావ్యాన్ని రచించిన దోనేరు కోనేరుకవి "భానుమతీ విమలాదిత్యుల పుత్రుడు రాజరాజనరేంద్రుడనియు, అతడు రాజ మహేంద్రవరమను పేరి రాజధానిని గట్టించి వేంగిదేశము నేలెననియు, ఆతని పెద్దకొడుకు, శాంతమూర్తి అయిన సారంగధరుడు పినతల్లి వలన కలిగిన ఆపదను గడచి చౌరంగియను సిద్ధుడయ్యెననియు"

---

17. చూ. కోరాడవారి 'నవనాథచరిత్ర' పీఠిక. ఈ గ్రంథంలోని చతుర్థస్కంధ ప్రథమభాగము మాత్రమే ముద్రితమయ్యెనట.

తెలుస్తున్నది. అనగా ఈ కథను 1547 ముందే తెలుగు దేశమునకు ముడిపెట్టటం జరిగినదన్నమాట. సారంగధర చరిత్రను పద్య కావ్యంగా రచించిన చేమకూర వేంకటకవి (రఘునాథరాయలకాలము 1614-33) గౌరనకథనే గ్రహించినప్పటికీ రాజమహేంద్రుని మాళవపతి అనీ, రాజమహేంద్రవిభుడనీకూడా పేర్కొన్నాడు. అంతేకాక మాంధాత పురాన్ని రాజమహేంద్రవరంగా మార్చినాడు. దీనినిబట్టి ఈ కథను తెలుగుదేశానికి ముడిపెట్టుటయందే వేంకటకవి మొగ్గుచూపెననుట స్పష్టము. క్రీ. శ. 1656 లో అప్పకవీయం రచించిన కాకునూరి అప్పకవి సారంగధరుడు రాజరాజనరేంద్రుని కుమారుడనీ, తండ్రి మతిసెడి సారంగధరుని కాళ్లుసేతులు నరికించగా మత్స్యేంద్రుని కరుణచే నవి మొలచెననీ, అంతట సారంగధరుడు సిద్ధుడయ్యెననీ వ్రాసెను. అటుపిమ్మట సారంగధర చరిత్రను చేపట్టిన సముఖము వేంకటకృష్ణప్పనాయకుడు, శాణాల శంభుదాసుడు, కూచిమంచి తిమ్మకవి ఈ కథకు ఆంధ్రదేశంతో అవినాబావ సంబంధాన్ని స్పష్టంగా నిరూపించినారు. మరికొందరీ కథను పాటల రూపమున కూడా రచించినారు. వేంకటకవి తరువాతివారు, 'మాళవదేశ' మన్నమాటనుకూడ పూర్తిగా విస్మరించినారు.

ఇట్లు జరగటానికి హేతువు, వేంకటకవి సారంగధర చరిత్ర పీఠికలో దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు పేర్కొన్నట్లుగా "మహాత్ములకథను – మహాపురుషుల జీవితములను తమతమ అభిజనములకు– అనువగుచో అన్వయమునలకు - అతుకుపెట్టుకొని యానందించెడు మానవ స్వభావమే" అని చెప్పవలసి ఉంటుంది. ఇట్లా పదహారణాల తెలుగు కథగా మారిపోయిన సారంగధరచరిత్రనే ఆచార్యులవారు చేపట్టినారు. గౌరన, వేంకటకవి చిత్రాంగి 'భోగసతి' అని చెప్పినారు. కాని శంభుదాసుడు, తిమ్మకవి ఆమె రాజుగారి రెండవ భార్య అని మార్పుచేసినారు. "సారంగధరునికి కన్యల నన్వేషించు

ప్రయత్నములో రాజు చిత్రాంగి పటమును చూచి మోహించి, ఖడ్గమును పంపి, వివాహకార్యము నెరవేర్చి చిత్రాంగిని భార్యగాచేసు కొనినాడు. తాను చిత్రమందు చూచినవాడును, రాజును ఒకరు కాకుండుటచే సందేహించిన చిత్రాంగి చెలికత్తెలవలన నిజమెరిగి తాను మోసగింపబడినట్లు గ్రహించెను" అని శంభుదాసుడు కల్పించి నాడు. ఆచార్యులవారు శంభుదాసుని అనుసరించినారు. ఇందువల్ల "చిత్రాంగి దుర్మోహమున కించుక క్షమాపణగలిగెడి" అని ఆచా ర్యులవారే పీఠికలో తెలిపినారు. ఇదేకాక, ఇంకా మరికొన్ని కల్పన లను కూడా వారు చేసినారు.

మన సారంగధర చరిత్రను పోలిన చరిత్రలు గ్రీకు – రోమన్ సాహిత్యములందును కన్పట్టటం ఆశ్చర్యం కలిగింపగలదు.[18] గ్రీకు విషాదరూపకకర్తలు ముప్వురిలో మూడవవాడగు యురిపిడస్ (B. C. 480-406) రచించిన హిప్పొలిటస్ (Hippolitus) అనే విషాద రూపకమందలికథ, రోమన్ నాటకకర్త ఆయిన సెనీకా (క్రీ. పూ. 4-క్రీ. శ. 65) రచించిన 'హిప్పొలిటస్' లేదా 'ఫేడ్రా' (Hippolitus or Phaedra) అనే విషాదరూపకమందలి కథ అచ్చంగా సారంగధరుని కథవంటివే; అందున సెనీకా రచన తెలుగులోని కథకు మరింత సన్నిహితంగా ఉన్నది.

థీస్యూస్ గ్రీసుదేశపు రాజు; హిప్పొలిటస్ మొదటిభార్య కుమారుడు; అందగాడు, నీతిమంతుడు. రాజు రెండవ భార్య ఫేడ్రా. ఆమెకు సవతికుమారునిపై మోహముకలిగి తపించు చుండెను. ఇంతలో రాజు కార్యాంతర వ్యాసంగుడై దేశాంతర

---

18 చూ. రుద్రాభట్ల ప్రకాశరావుగారి వ్యాసము - "సారంగధర చరిత్ర (గ్రీకు, రోమన్ కథామూలములు)" భారతి - శ్రీముఖ వైశాఖము (1932)

మేగినాడు. ఒకనాడాకస్మికంగా రాజకుమారుడు ఫేడ్రా అంతః పురానికి వచ్చినాడు. రాణి కోరికను విన్న హిప్పొలిటస్ మండి పడి ఆమెను చంపదలచి కత్తినెత్తి కూడా స్త్రీహత్య చేయజాలక ఎత్తినకత్తి నచటనే విడిచిపోయినాడు. చేసేదిలేక దాసి, తన రాణిని రక్షించుటకై, అల్లరిచేసి, కత్తిని చూపి రాజకుమారునిపై నేరము మోపింది. రాజు వచ్చి, దాసి, ఫేడ్రాలుపన్నిన పన్నాగాన్ని నమ్మి కుమారుని చంపించినాడు. ఫేడ్రా కత్తి చేబూని దుఃఖ ముతో ప్రవేశించి, ప్రియుని శవంపైబడి ఏడ్చి, రాజకుమారుడు నిర్దోషి అని చెప్పి, కత్తిపైబడి మరణించింది. దుఃఖంతో రాజు మరణాన్ని కోరుకొన్నాడు – ఇది సెనీకా రూపకమందలి కథ. రాజకుమారుడు ఫేడ్రాగృహోని కేలవచ్చెనో సెనీకా తెలుపలేదు. ఇంక యురిపిడస్ ఆ ఇరువురు కలుసుకొన్నట్లే చెప్పలేదు. దాసి రాయము తెచ్చినది. రాకుమారుడు కోపించినాడు. ఇది అవ మానకరం కాగా రాణి ప్రాయోపవేశానికి పూనుకొన్నది. ఇంతలో కల్పించి వ్రాసిన ఒక ఉత్తరం ద్వారా రాణిని రాజకుమారుడు బలాత్కరించెనని రాజు భ్రమపడి, కుమారుని చంపించుటకు నిశ్చ యించినాడు. ఇందులో నిజం డయానా దేవత చెప్పినది. హిప్పొ లిటస్ దుర్మరణానికి కారణము 'వీనస్ దేవత' యొక్క ఆగ్రహమట. ఆమె కోపంవల్లనే ఫేడ్రాకు తనసవతి కుమారునిపై ప్రేమకలిగినదట. కాని తెలుగులో సహజమైన కారణాలు కల్పితాలైనవి- రాజు చేసిన మోసము, పావురాల ఆట.

అసలు, ఇట్టి కథకు మూలము ద్రావిడులలోని మాతుల కన్యోద్వాహ పద్ధతి ఔత్తరాహులైన ఆర్యులకు నచ్చకపోవుటమే అయి ఉంటుందని కేతవరపు రామకోటి శాస్త్రిగారూహించినారు.[19] కాని, ఇది తప్పు మన హిందూ వేద బ్రాహ్మణ పురాణాది వాఙ్మయ

19. చూ. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక – మన్మథ చైత్రము పుట. 45.

ములలో నెక్కడను ఒక యువతి తన సవతి కుమారుని కామించి కవయగోరిన వృత్తాంతము కన్పట్టదు. ఇట్టి వృత్తాంతము గ్రీకు పాశ్చాత్య వాఙ్మయములందనేకములు కలవు. కుమారుడు తనతల్లి నే వివాహమాడి సంతానమును బడసిన కథను ఎస్కిలస్ నాటకకీరించి నాడు-Eadepus Rex. అది ఉత్తమ నాటకంగా నేటికిని విమర్శకులచే ప్రశంసల నందుకొనుచున్నది. ఇట్టి కథ ఒకటి మన ప్రాచీన ఐతిహ్యములందును కలదు. కాని తల్లి కుమారుని వలన సంతానమును పడయుట వంటి ఘోరమందు లేదు. వేశ్యా గృహమందున్నది తన తల్లి అని తెలియక ఆమెను కవయబోవుచున్న రాజు దారిలో ఒక అవుదూడ తోకను త్రొక్కినాడు. అది బాధతో తల్లితో చెప్పుకొన్నది. "తల్లిని కవయ బోవుచున్న వాడింతకంటె ఘనకార్య మింకేమి చేయునులే" అని ఆ గోవు దూడ నోదార్చినది. పశు భాష తెలిసిన రాజు నిజమెఱింగినాడు; ప్రమాదం తప్పినది. ఇట్లే మనవారేదో ఒకటి కల్పించి, ఘోరములను నివారిస్తూఉంటారు. కాని పాశ్చాత్యుల నీతి ప్రమాణాలు వేరు. వారి కిట్టివి హేయములు కావు. అందుచేత ప్రాచీనకాలమందే అచ్చట ఇట్టి కథలు సాహిత్యమున స్థానము నాక్రమింకొనుచుట కవకాశము కలిగినది. క్రీస్తుశకము రెండవ శతాబ్దికి పూర్వం నుంచీ రోము మొదలగు పాశ్చాత్య దేశాలతో దక్షిణాపథము వర్తక వ్యాపారములు నెరపు చుండుట వాస్తవమైన చరిత్రాంశము. కావున రుద్రాభట్ల ప్రకాశరావుగారు సూచించినట్లు గౌరన కాలానికి ముందే ఈ కథ ఇచ్చటికి దిగుమతి అయి ఉంటుంది.

మూల మెచ్చటిదైనా క్రీ. శ. 15, 16 శతాబ్దాల నాటికి ఈ కథ తెలుగు దేశానికి ముఖ్యంగా రాజరాజునకు సంబంధించినదిగా స్థిరపడిన దనటం స్పష్టము. పాశ్చాత్య రూపక ప్రభావానికి లోనైన ఆచార్యులవారికి, విషాదరూపకము రచించటానికి కథ బాగుంటుందని తోచి, దీనిని చేపట్టినారు. సారంగధరుడు తిరిగి బతకటం వారికి

రుచించలేదు. అందుచేత కథను దుఃఖాంత మొనర్చి తదనుగుణంగా కథాగతిని మలచుకొన్నారు.

రూపకాలలో నీతి ప్రతిపాదనను గూర్చి ఆచార్యుల వారు విషాద సారంగధర ప్రథమ ముద్రణ పీఠికలో ఇట్లా వ్రాసినారు- "... ఈ కథయే యప్రశస్త మనియు సవతి తల్లి కుమారుని మోహించుట దుర్నీతిదాయక మనియు నాటకమునకుఁ దగినది కాదనియుఁ గొందఱి యభిప్రాయము. నీతియు, దుర్నీతియు, బర స్పరాధారములు గల్గినవి. దుర్నీతి యించుకైనన్ బ్రకటింపకున్న నీతికిఁ గాంతిగలుగదు. రావణుని దుర్నీతి లేకున్న శ్రీరామునకంత కీర్తి కలుగునా? దుర్యోధనుని దుర్నీతి లేకయున్నఁ బాండవుల కంతటి ఖ్యాతి కలిగి యుండునా? కావున నీతి కుదుర్పవలె నన్న, దుర్నీతి నించుక ప్రకటించియే తీరవలెనని నాసవినయ విజ్ఞాపనము. రుచిభేదములు నభిప్రాయ భేదము లున్న నుండుఁగాక"

అసలు విషాద రూపక రచనాన్ని గూర్చి ఆచార్యులవారు విషాద సారంగధర ప్రథమ ముద్రణంలోనే ఇంకా ఇట్లా వ్రాసినారు– "......ఈ నాటకము విషాదాంతముగా నొనర్పబడి యున్నది. ఇది క్రొత్త పద్ధతి యగుట యెఱుఁగని వాఁడఁగాను. ఆంగ్లేయ భాష యందిట్టి విషాద నాటకములనేకములు కలవు. నీతిబోధ విషాద నాటకముల యందువలె మంగళాంత నాటకముల యందుఁ గలుగఁ జాలదని నాకుఁ దప్పని యభిప్రాయము. కావున నీక్రొత్త పద్ధతి ననుసరించితి. కథలో సారంగధరుని కరపాదచ్ఛేదమైన పిదప సిద్ధుఁ డొకఁడరుదెంచి కాలు సేతులు మొలిపించెనని వ్రాయఁబడి యున్నది. అరసిచూడ విషాదాంతముగాఁ గథ ముగించుటకుఁ గల యనభి లాషము సిద్ధుని రాకకుఁ గారణమైనట్లూహింపఁ దగియున్నది. కాలు సేతులు మరల మొలచుట స్వాభావికము కాదు కావునను,

సారంగధరుని మృతియే స్వాభావికముగ నుండుటయేకాక కథ యందలి నీతిని పట్టుదలగాఁ గలిగించుట కాధారమగుటం జేసియు, నదియే యాదరింపఁబడి యున్నది. సారంగధరుని శిక్షించిన పిదప యాకాశవాణి వలనఁ జిత్రాంగి దుర్నీతి రాజునకుఁ దెలిసెనని కథలో నున్నది. ఇంత తెలిసియున్న యాకాశవాణి సారంగధరుఁడు శిక్షితుఁ డగుట వఱకు నీ వృత్తాంతము వెలిఁబెట్టని కైలాట మేల యొనర్చెనో తెలియదయ్యె. ఇదియు స్వాభావికముకామి నయ్యాకాశవాణి సాహాయ్య మీనాటకమునఁ గోరఁబడదయ్యె.

"కొందఱీ నాటకమున సారంగధరుని మృతి నీతిదాయకము కాదని నాతో మందలించిరి. ఎందుఁగాని నీతిపరులకు సుఖమును, దుర్నీతిపరులకు దుఃఖమును గలుగుటయే ఫలశ్రుతిగో సంతసము నించునది యనియు వచించిరి. లోకమున ననుభవమున నట్లు పరిణమింపదని నేను వచించితి. సత్పురుషుల కెందుఁగాని ప్రాయికముగా బాధలు వచ్చుటయే మనము కనుచున్నారము. అదిగాక లోకమున జరుగు విషయములలో నెన్నియో పొరఁబాటులు కలవు గదా? సద్గుణము కలవార లెందఱికో చెప్పరాని దుఃఖములు కలుగుట చూడమా? వాని కన్నిటికిఁ గారణములు చెప్పుటకు సాధ్యమా? అట్లే యియ్యెడ నూహింపవలయు. మంచివాఁడై, ఏకపత్నీవ్రతుఁడై యణుమాత్రమైన నపరాధ మెఱుఁగని మహానుభావుఁడై యున్న వానికిఁ గొంచెమయినను సుఖముం గలిగింపక చంపినందున నాటకమును జూచిన వారు సద్గుణముల వలనఁ బ్రయోజన ముండఁజాలదని యభిప్రాయపడుదురని కొందఱి వాదము. అది యాదరణీయము కాదని నా విన్నపము. ఇతరనీతు లెన్నియో దీనియందుఁబొడకట్టుచుండఁగా నిట్టి యభిప్రాయ మెవ్వరికిని గలుగదు. సారంగధరుని యందపరాధ కల్పనమే వలయునన్న తన కెప్పుడు శ్రేయముంగోరు

ప్రాణసఖుఁడు సుబుద్ధిమాట యింతైనను విననిది యపరాధమేయని యూహించిన నూహింపవచ్చుఁగదా?''

తెలుగులో ఇది ప్రథమ విషాద రూపకము కావటంచేతను, ఇది విషాదరూపకమని స్పష్టంగా తెలియ జెప్పవలెననెడి కోరికతోను ఆచార్యులవారు 'విషాద' పథమును ముందుచేర్చినారనీ, దానిని చేర్చ వలసిన అవసరము లేదనీ, 'సారంగధర' అని కాని, 'సారంగధర నాటకము' అనికాని అంటే ఛాలుననీ సారంగధరుని నాయకునిగా తలంచిన కొందరి అభిప్రాయము. కాని, ఇది సరిఅయిన అభిప్రాయము కాజాలదు. సాధారణంగా నాయకుని బట్టికాని, నాయికనుబట్టికాని, ఏదేని సన్నివేశ ప్రాధాన్యమునుబట్టి కాని నాటకానికి పేరు పెడ తారు. ఈ నాటకమందలి నాయకుడు రాజరాజు కాని సారంగ ధరుడు కాడు. ఆచార్యులవారు రాజరాజునే నాయకునిగా నిర్దేశించి ఉన్నారు. పాత్రలపట్టికలో 'రాజనరేంద్రుడు—కథానాయకుఁడు' అనికలదు. ఈ నాటకము ఆచార్యులవారు జీవించి ఉండగానే ముద్రితమైనది కాబట్టి ఈ వాక్యము ఆచార్యులవారు స్వయంగా వ్రాసినదే అనుట నిస్సంశయము. ఏకైక పుత్రుడు, సౌజన్యమూర్తి, వంశవర్ధనుడు అయిన సారంగధర కుమారుని కోల్పోవటం అనేది రాజరాజు జీవితంలో అత్యంత ప్రధానమైన సన్నివేశము. అట్టి మహాద్దుఃఖము (విషాదము) నకు హేతుభూతుడైన సారంగధరుని బట్టి దీనికి 'విషాద సారంగధరము' అనే పేరు సమంజసమే అవు తున్నది.

ఇట్లా రాజరాజు కథానాయకుడు కాగా ఇంక దీనికి విషాద రూపక లక్షణములన్నీ పట్టినవో లేవో పరిశీలించవలసి ఉన్నది. విషాద రూపక నాయకుడు సత్పురుషుడే అయినప్పటికీ ముఖ్యంగా తనదైన ఒక అల్పదోషంచేత పతనం చెందుతాడు. రాజరాజు ఉత్త ముడు; చక్రవర్తి. కాని, వానిలోని 'కామము' అనే దోషము

కోడలు కావలసిన యువతిని భార్యనుగా స్వీకరింపజేసి, ఆమె మనస్సులో ఆరని చిచ్చును రగుల్కొన జేసినది. అందులకు ఫలితంగా వంశవర్ధనుడైన ఏకైక పుత్రుని కోల్పోయి తత్ఫలమనుభవించినాడు. దీనితో ఇతడు జీవచ్ఛవమే అయినాడు. ఏదేని కథను దుఃఖాంతము చేయటం చేతనే అది విషాద రూపకము కాజాలదు కథా గమనమంతా ఆ విషాదాంతమున కున్ముఖంగా సాగవలయును; అప్పుడే అది విషాదరూపకము (ట్రాజెడీ) అనిపించుకొంటుంది. ఇట్లా కథను నడపుటనే నిర్వహణశిల్పమంటారు.

నిర్వహణశిల్పమందు ప్రధానమైన అంశాలు మూడు కలవు- 1. వస్త్వైక్యమును సాధించటం; 2. రచన ఉదాత్తంగా ఉండటం; అనగా శైలిపటువుగా, సంభాషణలు నిబిడంగా, పద్యాలు తగిన ఛందములలో రసోద్దీపకాలుగా ఉండటం; 3. పాత్రపోషణము ఉత్తమంగా ఉండటం; అనగా పాత్రవర్ణన మత్యల్పంగాను, క్రమ పాత్రోన్మీలనమధికంగాను జరగటం శిల్పసమ్మతము. ఈ మూడింటిని వరుసగా పరిశీలించుదాము.

1. రూపకమునకు అతిప్రధానమైన వస్త్వైక్యము ఇందు చక్కగా సాధింపబడినది. కాని కేతవరపు రామకోటి శాస్త్రిగారి దృష్టిలో (ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక-మన్మథ చైత్రము-పు.53) తృతీయాంకమందలి సుదీర్ఘమైన న్యాయవిచారణ ఘట్టము వస్త్వైక్యమును భంజించుచున్నది. ఇచ్చట రాజరాజు ట్రాజెడీ నాయకుడుగా కాక న్యాయాన్ని పాలించే చక్రవర్తిగానే దర్శనమిచ్చుచున్నాడని వారి తలంపు. ఇక్కడ ఒక విషయాన్ని మాత్రము గుర్తునందుంచుకొనవలసి ఉన్నది. రాజరాజు అప్పటికింకా దుఃఖోపహతుడు కాలేదు. భార్యకు అవమానము జరిగినదను భ్రమలోపడి క్రోధావిష్టుడు మాత్రమైనాడు. కాని అతడు సహజంగా ధీరోదాత్తుడు కావటంచేత ఆ భావాన్ని సంయమించుకొని, ధర్మాసనము నధిష్ఠించి, దీర్ఘ విచా

రణను న్యాయాన్వేషణ బుద్ధితో సహించినాడనీ, దీనివలన అతని పాత్రపోషణకు క్షతికాని, వస్త్వైక్యమునకు భంగముకాని కలుగలేదని చెప్పవచ్చు. ఉత్తర రంగము మాత్రము అనావశ్యకమనియే చెప్ప దగును.

2. కాలానుసారంగా శైలి ప్రాబంధికమైనది. శబ్దమునకు ప్రాధాన్యము లభించినది. సంభాషణలు కొన్నిచోట్ల సుదీర్ఘము లైనవి. ఈ కారణములచేత రచనా శిల్పము నేటి దృష్టిలో కొంత కుంటుపడినదని చెప్పక తప్పదు.

3. ఇంక పాత్రపోషణము. ఇందుప్రధానపాత్రములు మూడు-రాజరాజు, చిత్రాంగి, సారంగధరుడు. రాజరాజు ఉత్తమ విషాద నాయకుడనటం నిర్వివాదము. రాజరాజు పాత్రకంటెను చిత్రాంగి పాత్ర మరింత పరిపూర్ణంగాను రమణీయంగాను పోషింపబడి నది. చిత్రాంగి పాత్ర పరిపోషితమైన పద్ధతిని వివరిస్తూ ఆచార్య తణికెళ్ళ వీరభద్రుడు గారు చక్కని విమర్శ వ్రాసియున్నారు. (సారంగధర పూర్వ ముద్రణములందు కన్పట్టగలదు.) ఇటువంటి విమర్శలకు వీరభద్రుడు గారే ప్రథములు. ఇంక సారంగధరుడు. ఇందు వీని పాత్ర రూపు కట్టలేదని రామకోటిశాస్త్రిగారు అభిప్రాయ పడినారు అది సమంజసంగా కన్పట్టదు.

సారంగధరునియందీ సుగుణాలు ప్రస్ఫుటము లవుతున్నవి-యౌవనము, చక్కదనము, సౌజన్యము, ఆత్మసంయమనము, ఆత్మ స్థైర్యము. వయోధర్మమునకు మించిన ఇంద్రియ నిగ్రహమునకు సారంగధరుడు ప్రతీక అని చెప్పవచ్చు. సర్వనాశము తన్నెదుర్కొను చున్నప్పటికీ పినతల్లి దౌష్ట్యమును ప్రకటించని చిత్తస్థైర్యము ఉదాత్త లక్షణమునకు పరాకాష్ఠ. నాటకమునందలి కరుణరసానికి ఆలంబ నము సారంగధరుడే. కావుననే సారంగధరుని పాత్ర రూపుకట్టలేదనటం

సమంజసం కాజాలదు. అయితే సారంగధరునిలో ఖేలన ప్రియత్వము అనే వ్యసనాన్ని, మిత్రవాక్యాలను పెడచెవిని పెట్టటమనే మూర్ఖత్వాన్ని దోషాలుగా పేర్కొనవచ్చు. కాని ఇచ్చట విధి ప్రాతికూల్యమే బలీయమైనట్లుగా పేర్కొనవచ్చు. "ప్రాయః సమాపన్న విపత్తికాలే ధియోఽపి పుంసాం మలినీ భవంతి" అన్నట్లు విపత్తు ఆసన్నమై ఉండగా మనీషుల బుద్ధులును మందమగు చుండును. కాగా సారంగధరుని చరిత్ర ఒక ట్రాజెడీ; ఇది రాజరాజు చరిత్ర అనెడి ట్రాజెడీకి దారి తీసినది.

ఇట్లా ఆచార్యులవారు విషాదరూపక నిర్మాణమున కృతకృత్యులైనారు. అంతకుముందు సుప్రతిష్ఠితమైన మార్గమేదీ లేకపోయినప్పటికీ, నాడు విషాదరూపకరచన లోకమున కెదురీదటమే అయినప్పటికీ సాహసించిన ఆచార్యులవారు తెలుగు నాటకచరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించినవారైనారు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No

# రచనలో సామాన్యలక్షణాలు

ప్రాచ్య-పాశ్చాత్య నాటక సిద్ధాంతాలను బాగా ఎరిగిన ఆచార్యుల వారు పాత కొత్తల సమన్వయానికి పూనుకొన్నారు. అట్టి దృష్టికలవారు కావుననే విషాదరూపకమును వ్రాయగలిగిన ప్రథములు కాగలిగినారు. వీరి విషాదరూపకాలలో "విషాద సారంగధరము" అగ్రశ్రేణికి చెందినదే కాక తెలుగువారి ప్రథమ విషాదరూపకము. తరువాతిది అజామిళనాటకము. పాదుకాపట్టాభిషేకము కూడ విషాద నాటకమే; అందులో దశరథుడే నాయకుడు. ముక్తావళి, అభిజ్ఞానమణిమంతము మొదట విషాదాంతాలుగానే రచింపబడినవి. విషాదరూపకము భారతీయులకు కొత్త; పాశ్చాత్యుల విషాదరూపకముల వంటివి సంస్కృతభాషలో లేవు.

2. అజామిళ తప్ప తక్కిన నాటకాలన్నీ గద్య - పద్య - గేయ సమన్వితాలు. తాను పాటలనేల గ్రహింపవలసి వచ్చెనో ఆచార్యులవారే చిత్రనళీయపీఠికలో చెప్పుకొనటం గమనించి ఉన్నాము. సంస్కృత నాటకాలన్నీ గద్యపద్య సమన్వితాలై చంపూజాతికి చెందినవి; అచ్చటచ్చట గేయాలుకూడా కన్పట్టగలవు. (విక్రమోర్వశీయ చతుర్థాంకమంతా గేయమయమే). ఇంక సామాన్య సంవాద

మంతా వచనంలో జరుగుతుంది. భావము తీక్షణమైనప్పుడు మాత్రము పద్యము లుపయుక్తములవుతూఉంటాయి. ఆచార్యులవారు కూడా ఆ పద్ధతినే అవలంబించినారు. తొలినాటి తెలుగునాటక రచయితలందరిమీదా షేక్స్పియరు నాటకాల ప్రభావమధికము. అవి కూడా చంపూకావ్యతుల్యాలే. నాటికి పాశ్చాత్యదేశాలలో కేవల గద్య నాటక యుగము నడుస్తున్నప్పటికీ దాని ప్రభావము వీరిపై పడలేదు. కాని, సంగీతము నెరుగని నటులధికమైనప్పుడు ఈ నాటకాలు కూడా పద్య-గేయాలు లేకుండగానే ప్రదర్శింపబడెడి వని మరువరాదు. కొండుభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి గారివి కేవలం గద్య నాటకాలే కావటం స్మరింపదగినది.

3. సంస్కృత రూపకాలన్నింటను ఒక్కొక్క అంక మొక్కొక్క రంగము; కాని పాశ్చాత్యులు అంకాన్ని అనేక రంగాలుగా (scenes) గా విభజిస్తారు. ఆచార్యులవారీ పద్ధతినే అవలంబించినారు. అంతకుముందు వీరేశలింగం పంతులుగారు మొదలగువారు ప్రహ్లాద-హరిశ్చంద్రాది స్వతంత్ర నాటకాలను రచించినప్పటికీ వారు సంస్కృత సంప్రదాయాన్నే అనుసరించి నూటికి 95 పాళ్ళు ఒక్కొక్క అంకాన్ని ఒక్కొక్క రంగంగానే రచించినారు. ఏక రంగాలైన అంకాలు ఆచార్యులవారి రచనలలో మృగ్యములనే చెప్పవచ్చు. అభినయానికి, నాట్యధర్మికి ప్రాధాన్యమొసంగిన భారతీయులకు రంగవిభజన మక్కరలేకపోయినది; కాని స్వాభావికతావాదాన్ని అంటే కేవలం లోకధర్మిని అభిమానించే వారికి రంగాల ఆవశ్యకత తప్పదు. (నాట్యధర్మిలో స్థలాంతర గమనాదులు ఊహామాత్రంగానే జరుగుతాయి)

4. ఆచార్యులవారు తమరచనలనెల్ల 'నాటకము' లనే వ్యవహరించినారు.

V.R. NARLA MEMORIAL LIBRARY D.P.R.I. Acc. No.

(i) నాటకమందలి కథ ప్రఖ్యాతం కావలెనని ఆలంకారికుల నిర్ణయము; అట్లే ఆచార్యులవారు కూడా ప్రధానంగా ప్రఖ్యాతాలైన భారత - భాగవత - రామాయణ కథలనే స్వీకరించినారు. రోషానారా శివాజీ వంటివి చరిత్ర ప్రసిద్ధాలు. ఔచిత్యాన్ని అనుసరించి కాని, కార్యకారణ సంబంధ నిరూపణంకోసం కాని కవులు ప్రఖ్యాతమైన కథలలో కూడా మార్పులు చేసి, కొత్త కల్పనలు చేరుస్తూ ఉంటారు. ఇట్లా చేయటానికి కవులకు అధికారమున్నదని ఆలంకారికులు కూడా అంగీకరించినారు; ఇది పాశ్చాత్యులకు కూడా సమ్మతమే. కావుననే ఆచార్యులవారిరచనలలో మార్పులు, చేర్పులు కోకొల్లలుగా కన్పిస్తాయి. కొన్నిచోట్ల అనావశ్యక వస్తువిస్తరణ ఉన్నప్పటికీ ఆచార్యులవారు సన్నివేశాల కూర్పులో సిద్ధహస్తులని చెప్పక తప్పదు

(ii) నాయకుడు ప్రఖ్యాతుడు, ఉదాత్తుడు అయిన రాజర్షి కావలయునని ఆలంకారిక నిర్ణయము. కాని ఆచార్యుల వారీ సూత్రమును యథాతథంగా పాటించలేదు. నాయకులు చాలావరకు ప్రఖ్యాతులే అయినప్పటికీ అందరు ఉదాత్తులే అని చెప్పటకు వీలులేదు. మనవారు ప్రధాన వ్యక్తులను కేవలము ఉత్తములుగానో, లేదా కేవలము దుర్మార్గులుగానో నిరూపిస్తూ ఉంటారు. కాని, పాశ్చాత్యులు ఉత్తమ వ్యక్తులలోని దుర్గుణాలను, దుర్మార్గులలోని ఉత్తమ గుణాలను కొంచెంగా అయినా నిరూపిస్తారు. ముఖ్యంగా ఉత్తములలో ఏదో కొంచెము దుర్గుణము లేదా లోపము కూడి ఉండటంవల్లనే వారు పతనం చెందుతూ ఉంటారు. అందుచేతనే అటువంటి కథలు విషాద రూపకాలకు అనువుగా ఉంటాయి. అంటే ప్రత్యూతదృష్టికి ఘోరంగా కన్పట్టని లోపంవల్లనే వారి జీవితం విషాదాంతమవుతుంది. ఒక్కొక్కప్పుడు నాయకునకు సంబంధంలేని స్వల్పకారణం వల్ల కూడా అతడు

దుర్గతిపాలు కావడం జరుగుతూ ఉంటుంది. ఆచార్యులవారు ఈ పాశ్చాత్య పద్ధతినే అవలంబించినారు.

(iii) నాటకమునందు ఐదు మొదలు పది అంకముల వరకును ఉండవచ్చు. వరూధిని తప్ప ఆచార్యులవారి తక్కిన నాటకములన్నీ పంచాంక పరిమితములే. ఇది షేక్స్పియర్ మార్గము.

(iv) భారతీయులు నాయక పతనమునకంగీకరింపరు; పాశ్చాత్యులకది మాననీయమే. రంగస్థలమందు ఆలింగన చుంబనాదులను ప్రదర్శింపరాదని ఆలంకారికులమతము; కాని, పాశ్చాత్యులకిట్టి నిషేధములు లేవు. ఇట్టి విషయమునందు ఆచార్యులవారు పాశ్చాత్యులనే అనుసరించుట స్పష్టము.

5. నాందీ ప్రస్తావనా భరతవాక్యాలు సంస్కృత నాటకాలలో విధిగా ఉంటాయి; అంతేకాక ప్రవేశక విష్కంభాది అర్థోపక్షేపకాలు కథాసంధానకాలుగా అంకాల ప్రారంభంలో ఉపయుక్తాలవుతాయి. గ్రీకు రూపకాలలో ఈ పనులన్నీ కోరస్ నిర్వహిస్తుంది. అంకాన్ని రంగాలుగా విభజించటంతో పాశ్చాత్యులకు వీటి అవసరం లేకపోయింది ఆచార్యులవారు పాశ్చాత్యులను అనుసరించటంచేత అర్థోపక్షేపకాలను చాలా విరళంగా వాడినారు. (కొన్ని నాటకాలలో నాందీ ప్రస్తావనలు, మరికొన్నింట భరతవాక్యాలు కూడా లేవు— ఇందులకు కారణం ఇదివరకు సూచించినాను.) షేక్స్పియర్ ప్రభృతులు కొన్ని నాటకాలలో ఆదిలో కాని, అంతంలో కాని కథావివరణం ఆవశ్యకమైనప్పుడు ఆదిలో 'ప్రోలోగ్'ను (prologue రోమియో జూలియట్ నాటక ప్రారంభంలో వలె), అంతంలో 'ఎపిలోగ్' ను (Epi'ogue-యాజ్‌యులైక్ ఇట్‌లోవలె) వాడుచుండేవారు. ఆచార్యులవారు 'ఎపిలోగ్' ను మాత్రము 'ఉత్తర రంగము' అనే పేర అనుకరించినారు. రెండు నాటకాలలో పూర్వరంగాలను కూడా వ్రాసినారు.

6. ఆచార్యులవారు ప్రఖ్యాతములైన కథలనే గ్రహించినప్పటికీవారికి నీతిబోధయందు కూడా దృష్టి ఉండటంచేత ఆధునిక రాజకీయ సాంఘిక సమస్యలను కూడా అందులో చొప్పించినారు. పాంచాలీ స్వయంవరంలోని యువతీ వివాహ ప్రశంస, ప్రమీలార్జునీయంలోని స్త్రీ స్వాతంత్ర్య సంబంధి చర్చ, చంద్రహాసలోని ఉప్పుపన్ను మీది ఉపన్యాసము, అజామిళలోని రజస్వలావివాహ–సురాపాన నిషేధ ప్రశంసలు ఇందుల కుదాహరణలు.

ఇందులో కొన్ని ఆయా కథలకు అతకలేదు. భారతకథను గ్రహించిన చిరకారి నాటకంలో ఆంగ్ల పదాలు కలవు (పుట 33). ఇట్టి వాటిని anachronisms అనే దోషంగా పరిగణిస్తారు. ఇంక ఆయా నాటకాలవల్ల నేర్వదగిన నీతులను ప్రత్యేకంగా "ఉత్తర రంగము" లనే పేర ఆచార్యులవారు వివరించినారు.

7. ప్రస్తావనా-ఆముఖాంగ–అర్థోపక్షేపక భేదాల ప్రయోగం చేత కథాసూచనము, ప్రథమపాత్రప్రవేశసూచనము జరుగుతుంది కాబట్టి భారతీయ నాటకాలలో ఆకస్మికారంభము కన్పట్టదు. పాశ్చాత్యుల పద్ధతిననుసరించిన ఆచార్యులవారు తమనాటకాలను ఆకస్మికంగా ఆరంభించటానికి అలవాటు పడినారు. వారి నాటకాలలో చాలా నాటకాలిందులకు ఉదాహరణలే. ఈ విధమైన నాటకారంభం కూడా రమణీయంగానే ఉన్నది.

8. ప్రాచ్య-పాశ్చాత్యులు కథా విషయంలో సమప్రాధాన్యం చూపేవారు అయినప్పటికీ భారతీయులు రసపోషణ మందెక్కువ మక్కువ చూపగా, పాశ్చాత్యులు పాత్రపోషణ మీద, చిత్తవృత్తుల నిరూపణంలోను ఎక్కువ దృష్టి నిల్పినట్లుగా గోచరిస్తుంది. కాని నిజం చెప్పవలెనంటే ఇది పెద్ద భేదమేమీకాదు. షేక్స్పియర్ ప్రభృతుల నాటకాలలో ఎటువంటి పాత్రచిత్రణం లేదా పాత్ర

పోషణం కలదో శాకుంతల-మృచ్ఛకటిక - ముద్రారాక్షసాదులలోను అటువంటి పాత్రపోషణమే కలదు. కావున రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు చెప్పినట్లుగా "ప్రాచ్యులకును, పాశ్చాత్యులకును నాటక రచనలో తత్త్వము నందంతగా భేదములేదు. ఇరువురును రసోపాసకులే. కాని పరిభాషయందు కొంత భేదము కలదు."[20] ఇంక పాశ్చాత్యులు భావ సంఘర్షణకు అధిక ప్రాముఖ్యమిస్తారు; ఇది భారతీయులలో అరుదుగా కానవస్తుంది; కానవచ్చినా తద్విపులీకరణం కన్పట్టదు. ఆచార్యుల వారు రెండు మార్గాలను అనుసరించి, రస-పాత్రపోషణలకు, భావసంఘర్షణలకు సమప్రాధాన్యమొసంగినారు.

నిజం చెప్పవలెనంటే అరిస్టాటిల్-భరతమహర్షులు చెప్పినట్లుగా "కథ" ప్రధానము. దానిని ప్రతిభావంతుడైన కవి సంస్కరించుకొని, సన్నివేశాలను విభజించుకొని. సంవిధాన మొనర్చితే రస-పాత్రపోషణల కాతడింక ప్రత్యేకించి శ్రమించనక్కరలేదు; వాటి అంతట అవే సమకూడుతాయి. "ఇతివృత్తము" అనే పదాన్ని అభినవగుప్తుడిట్లే వివరించినాడు. ఆచార్యుల వారు సహజంగా ప్రతిభావంతులు కావటమే కాక పై విధంగా సంవిధానం చేకూర్చుకొనటంలో నిపుణులుకూడా కావటంచేత వారి నాటకాలు చక్కగా తయారు కావటానికి అవకాశం కలిగింది.

9. నాటకము ప్రదర్శన ప్రధానం కావటంచేత కథా విషయంలో గాని, భాషా విషయంలో గాని సామాజికుల పర్యాలోచనకు అవకాశం ఉండదు. అందుచేత కథలో క్లిష్టకల్పనలు కాని, అసంబద్ధకల్పనలు కాని, భాషలో జటిలత్వం కాని ఉండరాదు. ఈ విషయాన్ని ప్రాచ్య-పాశ్చాత్య విమర్శకులంతా అంగీకరించినదే. ఇట్లా

20. నాటకోపన్యాసములు - పుట. 59.

రచింపబడినవే ఉత్తమ నాటకాలుగా పరిగణింప బడుతున్నవి కూడా. ఆచార్యులవారు కూడా దీనిని చాలా వరకు పాటించినారు.

10 ఆచార్యులవారిమీద తెలుగుప్రబంధాల ప్రభావమధికము; అందుచేత వారి తొలినాటకాలు ముఖ్యంగా వాటిలోని వర్ణనలు, అందులకు ఉపయోగించిన ఛందస్సులు-తెలుగు ప్రబంధాలను తల పిస్తూనే ఉంటాయి. కాని, వారు శబ్దాల కిచ్చినంత ప్రాధాన్యాన్ని పద్యాలలో భావ గాంభీర్యాని కివ్వలేదనే చెప్పవచ్చు. ఇంక వచనాలు, తొలి నాటకాలలో, ప్రాబంధికశైలిలోనే సాగిపోయినవి.

11 కాళిదాసాదులు హాస్యాన్ని పరిమితంగా వాడినారు కాని, ఆధునిక సభ్యులను దృష్టిలో పెట్టుకొన్న ఆచార్యులవారు హాస్యానికి ఎక్కువ అవకాశమిచ్చినారు. కొన్నిచోట్ల కథతో అత కనివి కూడా ఉన్నాయి మరికొన్ని చోట్ల మాటలు సభ్యతను మీరి నవి కూడా.

12. వేణీసంహారాదులందు సంవాదంతోపాటు, కథనానికి కూడా ప్రాధాన్యము ఉంది. అట్టిది షేక్స్పియర్ నాటకాలలో కూడా కన్పట్టగలదు. దీనిని విమర్శకులు దోషంగానే పరిగణించిరి. అట్లే షేక్స్పియర్ 'స్వగతములు' ను విమర్శకులోనైనవి. అయినా ఆచార్యులవారు ఈ రెండు పద్ధతులను అధికంగా తమ నాటకాలలో ఉపయుక్తం చేసుకొన్నారు.

13. ఆచార్యులవారు కొన్ని నాటకాలలో 'మూకరంగ ములు' (Silent scenes) ప్రవేశపెట్టినారు. సుగ్రీవ పట్టాభిషేకంలో 'సప్తతాళభేదన రంగము', అజామిళలో 'ఇంటిని దోపిడీచేసే రంగము' ఇందుల కుదాహరణము.

14. తెలుగుదేశంలో నాటకకర్తలే భూమికాధారణంచేయటం వడ్డాది సుబ్బారాయుడుగారితో ప్రారంభమైనది. దానిని పరమ కోటికి కొనిపోయినవారు ఆచార్యులవారు. ఆచార్యులవారు నాటక రచయితలు, దర్శకులు, స్వయంగా నటులు. ఈ మూడుగుణములు ఒక్కరిలోనే సమకూడటం చాలా అరుదు. గ్రీకు నాటకకర్త లయిన సోఫోక్లిస్ మొదలగువారు, షేక్స్పియర్ ఇట్టివారే.

ఇంతవరకు ఆచార్యులవారి నాటకాలకు సర్వసామాన్యాలైన గుణాలను, దోషాలను పేర్కొన్నాను. దోషాలు అల్పాలనటం స్పష్టము; ఆచార్యులవారు కొంత జాగ్రత్తవహించి ఉంటే అవి కూడా లేకుండెడివే; కాని కాలప్రభావమట్టిది. ఆచార్యులవారికి ముందు తెలుగునాటకరచనకు సుప్రసిద్ధమైన మార్గమేదీ లేదు. సర్కారుజిల్లాలలో నాటకప్రదర్శనాలింకా ప్రయోగదశలోనే ఉన్నవి. బళ్ళారిలో వ్యతిరేకతఉన్నది. అటువంటిస్థితిలో ఆచార్యులవారు సాహసించి, స్వప్రతిభతో పెక్కు ఉత్తమనాటకాలు రచించి, దేశికత్వము వహించి, స్వయంగా నాయక భూమికలు ధరించి, ఉత్తమ సంప్రదాయాలకు చిహ్నమైన సరసవినోదినీసభను స్థాపించి, ఆధునిక తమిళనాటకరంగానికి మార్గదర్శకులై, ప్రాచ్య - పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించటంలో సిద్ధహస్తులైనారు ఇటువంటి మహామనీషి 'ఆంధ్రనాటకపితామహ' బిరుదానికి సర్వథా అర్హులనటం స్వభావోక్తిమాత్రమే.

## అనుబంధము-1

## Members of the Sarasavinodini Sabha that represented the important Characters of the Drama as it was played on the 29th January 1887

| Characters of the play. | | Names of members. | Designation. |
|---|---|---|---|
| Nala. | Mr. | D. Kristnamacharlu | 1st Grade Pleader. |
| Visarada | " | B. Hanumantha row | Land - holder. |
| Bhima | " | A. P. Samarow | Clerk, Dt. Munsiff's. Court. |
| Sudeva | " | P. Sriramulu | Acct.Collector'sOffice. |
| Indra | " | D. Vencatarow | Inspecting School Master. |
| Agni | " | M. Vasudevayya | Clerk,Collector'sOffice. |
| Yama | " | B. Hunumuntharow | Supra. |
| Varuna | " | SarangamSrinivasarow | Acct. Collector'sOffice |
| Suramali | " | S. Vencobarow | School Master. |
| Jayasena | " | L. N. Appaji | Local Board's Clerk. |
| Prativinda | " | O. Gurubhimarow | 2nd. Grade Pleader |
| Pushkara | " | M. LakshmipathiSastry | Clerk, Collecter's Officce. |
| Devala | " | R. Vencataramanacharlu | Clerk Dt. Court. |
| Varshneya | " | K. Ramarow | Acct. Collector's Office. |
| Kama | " | D. Gopalacharlu | 2nd Grade Pleader. |
| Krodha | " | N. Kristnarow | 2nd. Grade Pleader. |
| Lobha | " | A. P. Samarow | Supra. |
| Kali | " | C. H. Gowd | Union Chairman & Honorary Magte. |
| Janghika | " | O. Gurubhimarow | Supra |
| Indrasena | " | R. Madhava | Boy 4 years old then. |
| Viranaika | " | V. P. Ramochendra Sastry B. A. | School Master. |
| Rituparana | " | D. Vencatarow | Supra. |
| Damayanti | " | C. Seshasastrulu | Landholdar & Trader. |
| Bharati | " | R. Kesavarow | Student. |

## అనుబంధము-2

"Sir, The Bellary Sarasa Vinodini Sabha which was entertaining the Madras Public closed its season on sunday the 2nd instant, at V. P. Hall. The Hall was full and as many as 200 ladies had to go back disappointed for want of accommodation. Panchali Swayamvaram was repeated for the second time and it was a grand success-many medals were presented to Mr. D. Krishnamacharlu, the president of the Sabha, addresses were read and the Hon'ble Mr. P. T. Thyagaraya Chetti requested the Sabha to prolong its stay for a week more. The Sabha this season gave out 6 dramas of which Rukmangada, Panchali and Ajamila were new, and the remaining three-Chendrahasa, Muktavali and Sarangadhara were old. In all the above dramas, particular attention was not given to the arrangement of scenes and distribution of dresses. No doubt the Sabha has good scenes and good dresses, but one could well observe that they are very indifferent to those particulars. Of course even a diamond without being well set, will not shine well. I hope the Sabha, which has so much experience, will pay next time particular attention to scenes and dresses. I have observed durbars in ferest and streets. As for dress, I observed a Brahmin with stockings, a warrior with a uniform having no socks, a king with durbar dress while hunting and while riding. Servants with kings dress and kings (pamhali) with beggars and servants dress, Servants, Theleries and Mohammadans with sunyasis head dress and so many unnatural combinations. With 25 years of experience to come out like this is simply horrible. I hope the Sabha will pay very particular attention to all these important and necessary items. It was not possible to find out who a particular character is until it is given out and many are indifferent to their position, place and action. I found out as I attended all the dramas, only one man who was very particular to all these; even if he had come out in the streets in broad daylight no one, I am sure would not have found him out as a character. It is he who has appeared as a labbi Mohamaden, a false preist, a Modeliar assesser and as an inimitable piper and

potter. His entrance was sufficient to electrify the audience. It is only he who never failed to receive applause every time he entered on the stage. Till now the parsis had thought that the comic actions were their sole monopoly. This time Mr. Madhava Row, the general manager of the Sabha, the above piper and potter, beat them thoroughly. The parsees had one defect, that is, over - acting, and over - doing. Mr. Madhava Row being an educated man never exceeded the propriety even on a single occassion. We, at any rate, always welcome our dear potter, Gundapat, to appear in every drama. There are many who are capable of good acting. We hope they will do well to pay particular attention to all these things. Hero, Mr. D. Venkatakrishnamacharlu and the two heroines also contributed greately to the success of all dramas. We hope the Sabha will go to Madras every year and when they go next time, I hope they will particularly pay attention to the scenes and dress.

—Critic (Indian Patriot 8-1-1910)

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA102B127 |
| పుస్తకం పేరు | ధర్మవరం రామకృష్ణమాచార్యులు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 99 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | CI, BC, 1, 6, 84, 26, |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | M. Raju |
| పేజీలు విడదీసినది | M. Raju |
| స్కాన్ చేసినది | [illegible] |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |